మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

నేటి ఈవార్తలు
NETI EVARTHALU
దినపత్రిక
www.evarthalu.com

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

బుధవారం WEDNESDAY 12-8-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 12 PAGES:12 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 2 Volume:2 | సంచిక: 44 Issue: 44

Circulated to Telangana
Published from Jagitial

12 ఆగస్టు 2026 - బుధవారం శ్రీ పరాభవ నామ సంవత్సరం దక్షిణాయనం - గ్రీష్మ ఋతువు ఆషాఢ మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:02 సూర్యాస్తమయం - సా. 6:40 తిథి అమావాస్య రా. 11:09 వరకు తరువాత పాడ్యమి సంస్కృత వారం సౌమ్య వాసరః నక్షత్రం పుష్యమి ఉ. 7:58 వరకు తరువాత ఆశ్లేష యోగం వ్యతీపాత మ. 3:23 వరకు కరణం చతుష్పాద మ. 12:30 వరకు నాగవ రా. 11:09 వరకు వర్జ్యం రా. 7:46 నుండి రా. 9:14 వరకు దుర్ముహూర్తం ఉ. 11:55 నుండి మ. 12:46 వరకు రాహుకాలం మ. 12:21 నుండి మ. 1:55 వరకు యమగండం ఉ. 7:36 నుండి ఉ. 9:11 వరకు గుళికాకాలం ఉ. 10:46 నుండి మ. 12:21 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:26 నుండి తె. 5:14 వరకు అమృత ఘడియలు తె. 4:36 నుండి ఉ. 6:05 వరకు అభిజిత్ ముహూర్తం లేదు గమనిక: "o" అనగా మరుసటి రోజున

# పాన్ మసాలా ప్యాకింగ్‌లో ప్లాస్టిక్ నిషేధం

## కేంద్రం గెజిట్ నోటిఫికేషన్ విడుదల



పాన్ మసాలా ప్యాకింగ్, విక్రయాలకు సంబంధించి భారత ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ కీలక నిబంధనలను తీసుకొచ్చింది. పర్యావరణ పరిరక్షణ, ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని పాన్ మసాలా ప్యాకింగ్‌లో ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధిస్తున్నట్లుగా గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది.

న్యూఢిల్లీ: ఇక నుంచి పాన్ మసాలా ప్యాకింగ్ కోసం కేవలం కాగితం, పేపర్ బోర్డ్, సెల్యులోజ్, సహజసిద్ధంగా లభించే పదార్థాలను మాత్రమే ఉపయోగించాల్సి ఉంటుంది. పాలిథిలిన్, పాలిప్రొపైలిన్, పాలిస్టర్, పాలీవినైల్ క్లోరైడ్ వంటి ఎలాంటి ప్లాస్టిక్, సింథటిక్ తరువాయి 2 వ పేజీలో...

# ప్లాస్టిక్ నోట్లకు కేంద్రం ఆమోదం

## పార్లమెంట్‌లో వెల్లడించిన కేంద్రమంత్రి నిర్మల



న్యూఢిల్లీ: దేశంలో త్వరలోనే ప్లాస్టిక్ కరెన్సీ నోట్లు చలామణిలోకి రానున్నాయి. రూ.10, రూ.20 విలువ కలిగిన పాలిమర్ నోట్లను ఫీల్డ్ ట్రయల్స్ (క్షేత్రస్థాయి పరిశీలన) ప్రాతిపదికన ప్రవేశపెట్టేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) చేసిన ప్రతిపాదనకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ మేరకు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌కు లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు. కొత్తగా ప్లాస్టిక్ నోట్లను చలామణిలోకి తీసుకొస్తున్నప్పటికీ ప్రస్తుతం చలామణిలో ఉన్న పాత తరువాయి 2 వ పేజీలో...

# కూలీ బతుకులు.. కూలిపాయే!




## సంగారెడ్డి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

### కూలీల ఆటోను ఢీకొట్టిన ట్యాంకర్
### మరో ఐదుగురికి తీవ్ర గాయాలు
### అందులో ముగ్గురి పరిస్థితి విషమం
### అక్కడికక్కడే ఏడుగురు దుర్మరణం

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం సత్వార్ గ్రామ సమీపంలో కూలీలతో వెళ్తున్న ఆటోను ఓ ట్యాంకర్ బలంగా ఢీకొట్టింది. ఈ ఘోర ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ఏడుగురు కూలీలు అక్కడికక్కడే మృతి చెందారు. మృతులంతా కర్ణాటక రాష్ట్రం బీదర్ జిల్లా రాజగిరి ప్రాంతానికి చెందిన వ్యవసాయ కూలీలుగా పోలీసులు గుర్తించారు. తీవ్రంగా గాయపడిన వారిని వెంటనే జహీరాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలించి మెరుగైన చికిత్స అందిస్తున్నారు.



సంగారెడ్డి, ఆగస్టు 11 (ఈవార్తలు): స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటకలోని బీదర్ జిల్లా రాజగిరికి చెందిన కొందరు వ్యవసాయ కూలీలు పనుల నిమిత్తం ఓ ఆటోలో బయలుదేరారు. ప్రమాద సమయంలో ఆటోలో సుమారు 14 మంది వరకు ప్రయాణిస్తున్నట్లు తెలుస్తోంది. వీరు ప్రయాణిస్తున్న ఆటో సత్వార్ గ్రామ సమీపంలోని యూ-టర్న్ వద్దకు రాగానే, కర్ణాటకలోని హుమ్నాబాద్ నుంచి తరువాయి 2 వ పేజీలో...



# తెలంగాణ ఓటర్లు.. 2,64,87,214

## నమోదు కానివాళ్లు 73,39,234 మంది

## ఇందులో చనిపోయినవాళ్లు 9 లక్షలు

తెలంగాణలో సోమవారంతో సర్ ప్రక్రియ ముగిసిన నేపథ్యంలో మంగళవారం ఓటర్ల గణాంకాలను రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారికంగా ప్రకటించింది. సర్ ప్రక్రియ కంటే ముందు.. తెలంగాణ ఓటర్లు మొత్తం 3,38,26,448 మంది. కాగా, సర్ ప్రక్రియ అనంతరం 2,64,87,214(78.30 శాతం) మంది ఓటర్లు తమ పేర్లను నమోదు చేసుకున్నట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది.


హైదరాబాద్, ఆగస్టు 11 (ఈవార్తలు): రాష్ట్రంలో మొత్తం ఓటర్ల సంఖ్య, ఎన్యుమరేషన్ ఫారాల స్థితిపై రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి వివరాలను మంగళవారం మీడియాకు రిలీజ్ చేశారు. 'సర్ ఎన్యుమరేషన్‌లో 73,39,234(21.70 శాతం) మంది ఓటర్లు తమ పేర్లను నమోదు చేసుకోలేదు. ఇందులో.. మరణించిన వారు -9,22,230, అన్‌ట్రెసబుల్ - 11,25,546, నివాస మార్పిడి - 45,18,961, ఇప్పటికే నమోదై తరువాయి 2 వ పేజీలో...

# 'స్మార్ట్' కార్డులు.. 1,06,28,092

### 3.43 కోట్ల మందికి చేకూరనున్న లబ్ధి
### 15న పంపిణీ చేయనున్న సీఎం రేవంత్
### 33 జిల్లాల్లో ఏకకాలంలో కార్యక్రమాలు
### మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి



రాష్ట్రవ్యాప్తంగా 3.43 కోట్ల మంది లబ్ధిదారులకు స్మార్ట్ కార్డుల పంపిణీకి సీఎం రేవంత్‌రెడ్డి శ్రీకారం చుట్టనున్నారు. ఈ నెల 15న సంగారెడ్డిలో జరిగే రాష్ట్రస్థాయి కార్యక్రమంలో సీఎం ఈ ప్రక్రియను ప్రారంభించనుండగా.. అదే రోజు 33 జిల్లా కేంద్రాల్లోనూ ఏకకాలంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ చేయనున్నారు. కార్డుల పంపిణీ ఏర్పాట్లపై పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మంగళవారం ఉన్నతాధికారులతో సమీక్షించారు.



హైదరాబాద్, ఆగస్టు 11 (ఈవార్తలు): పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, పౌర సరఫరాల సంస్థ డైరెక్టర్ రోహిత్‌సింగ్ తదితరులతో ఏర్పాట్లను సమీక్షించిన మంత్రి.. సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో మాట్లాడి సీఎం పర్యటన, బహిరంగ సభకు సంబంధించిన ఏర్పాట్లపై సూచనలు చేశారు. రాష్ట్రంలో ప్రస్తుతం 1,06,28,092 ఆహార భద్రత కార్డులు ఉండగా.. వాటి పరిధిలో -2 వ పేజీలో...




బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,382 |
| వెండి (కిలో): | రూ.2,60,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,385 |

# ఖేలో ఇండియా.. మన ఖలేజా!



### ప్రతిష్ఠాత్మకంగా ఖేలో ఇండియా యూత్ గేమ్స్ 2026
### డిసెంబరులో నిర్వహించేందుకు ఏర్పాట్లు
### మౌలిక వసతుల అభివృద్ధికి చర్యలు
### క్రీడా స్ఫూర్తిని చాటేలా పోటీలు: సీఎం రేవంత్ రెడ్డి

తెలంగాణ ప్రభుత్వం ఆతిథ్యం ఇవ్వనున్న ఖేలో ఇండియా యూత్ గేమ్స్ 2026 పోటీలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఎంసీఆర్ హెఆర్డీలోని బోధి పెవిలియన్ లో ఖేలో ఇండియా యూత గేమ్స్ ఏర్పాట్లు, నిర్వహణపై మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు.

హైదరాబాద్, ఆగస్టు 11 (ఈవార్తలు): జాతీయ స్థాయిలో వివిధ రాష్ట్రాల నుంచి పాల్గొనే ఈ పోటీలకు సంబంధించి మౌలిక వసతులను అభివృద్ధి చేయాలని సీఎం సూచించారు. డిసెంబరులో పోటీలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. హైదరాబాద్‌లోని స్టేడియంలలో ప్రస్తుత పరిస్థితిని పరిశీలించి, క్రీడా పోటీలకు అనుగుణంగా శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకు అవసరమైన నిధులను అందించేందుకు -2 వ పేజీలో...



# 14న తెలంగాణ కేబినెట్ భేటీ

హైదరాబాద్, ఆగస్టు 11 (ఈవార్తలు): ఈ నెల 14న తెలంగాణ కేబినెట్ సమావేశం జరగనుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశంలో.. పలు కీలక నిర్ణయాలను తీసుకోనున్నారు. ఈనెల 17వ తేదీ నుంచి రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనకు వెళ్తున్న నేపథ్యంలో.. రైతులు, ఉద్యోగులకు సంబంధించిన కీలక అంశాలపై చర్చించనున్నారు. అలాగే మెట్రో రైలు విస్తరణ, మూసీ నది ప్రక్షాళన వంటి వాటిపై కూడా మంత్రి వర్గ సమావేశం చర్చించే అవకాశం ఉన్నట్లు సమాచారం.

# '22-ఏ' ఆందోళన వద్దు


## అందరికీ న్యాయం చేస్తాం.. నిషేధిత భూములపై పొంగులేటి క్లారిటీ



రాష్ట్రంలో 22-ఏ లేదా నిషేధిత ఆస్తుల జాబితాలో ఉన్న భూములు, ఆస్తుల విషయంలో ప్రజలు ఎలాంటి ఆందోళన పడాల్సిన అవసరం లేదని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి భరోసా ఇచ్చారు. చట్టబద్ధంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తామని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం నుంచి కొనసాగుతున్న సాంకేతిక, చట్టపరమైన సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు.

హైదరాబాద్, ఆగస్టు 11 (ఈవార్తలు): కొత్తగా తమ ప్రభుత్వం ఎలాంటి భూములను నిషేధిత జాబితాలో చేర్చలేదని వెల్లడించారు. 22ఏ, పీఓబీ అంశంపై మంగళవారం సచివాలయంలో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజ్‌గిరి, సంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు.. జిల్లా రిజిస్ట్రార్లు, సబ్ రిజిస్ట్రార్లతో మంత్రి పొంగులేటి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు, వాటి పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలను జిల్లాల వారీగా పరిశీలించారు. అర్హులైన బాధితులకు వీలైనంత త్వరగా ఊరట కల్పించాలని తరువాయి 2 వ పేజీలో...

## విశ్వవాణి



చంద్రుడి దక్షిణ ధ్రువం సమీపంలోని శాశ్వతంగా చీకటిలో ఉండే గోతుల్లో దాగి ఉన్న నీటి మంచును గుర్తించేందుకు చైనా చాంగ్-7 ప్రయోగాన్ని చేపట్టనుంది. చంద్రుడిపై భవిష్యత్ అన్వేషణలకు అత్యంత కీలకమైన నీటి వనరుల కోసం ఈ మిషన్ ప్రత్యేకంగా రూపొందించారు. చాంగ్-7లో పలు అధునాతన శాస్త్రీయ పరికరాలను ఏర్పాటు చేయనున్నారు. అధిక స్పష్టత కలిగిన కెమెరాలు, పరారుణ కిరణాలను గుర్తించే సెన్సర్లు, వివిధ తరంగదైర్ఘ్యాల్లో సమాచారాన్ని సేకరించే హైపర్‌స్పెక్ట్రల్ ఇమేజర్ ఇందులో ఉంటాయి. ఈ పరికరాల సాయంతో చంద్రుడి ఉపరితలంపై ఉన్న ఖనిజాలను గుర్తించడంతో పాటు, ఉపరితలం కింద గడ్డకట్టిన నీటి ఆనవాళ్లను గుర్తించే ప్రయత్నం చేస్తారు.

# రావయ్యా.. రాహుల్!



### తెలంగాణలో 2 లక్షల ఉద్యోగాల సంగతేంది?
### జార్ఖండ్ నిరసనలపై మౌనమెందుకో?
### టీబీజేపీ చీఫ్ రాంచందర్ రావు నిలదీత

హైదరాబాద్, ఆగస్టు 11 (ఈవార్తలు): రాహుల్ గాంధీ అశోక్ నగర్‌లో ప్రకటించిన జాబ్ క్యాలెండర్ ఏమైందని.. రెండు లక్షల ఉద్యోగాలు ఏమయ్యాయని టీబీజేపీ అధ్యక్షుడు రాంచందర్‌రావు ప్రశ్నించారు. ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ నిరసనలపై కేంద్ర హోంమంత్రి పార్లమెంట్‌కు వచ్చి ప్రకటన చేస్తామంటే రాహుల్ ఎందుకు పారిపోతున్నారని ఎద్దేవా చేశారు. ఝార్ఖండ్ ఘటనపై ఎందుకు మౌనంగా ఉన్నారని నిలదీశారు. రాహుల్ లోక్‌సభకొస్తే అన్ని ప్రశ్నలకు అమిత్ షా జవాబిస్తారన్నారు. ఈమేరకు మంగళవారం ఆయన నాంపల్లిలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో తరువాయి 2 వ పేజీలో...

# బాబూ.. మా రైతుల కడుపు కొట్టకు

## తెలంగాణ ప్రాజెక్టులను రద్దు చేస్తే ఊరుకోం.. జల ఉద్యమం చేపడతాం: కేటీఆర్



హైదరాబాద్, ఆగస్టు 11 (ఈవార్తలు): తెలంగాణలో 7 ప్రాజెక్టులను రద్దు చేసే అంశంపై జరిగే జీఆర్ఎంబీ మీటింగ్‌ను కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం బాయ్‌కాట్ చేయకపోతే జలసౌధని ముట్టడిస్తాం అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరించారు. తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మంగళవారం మీడియాతో మాట్లాడారు. 'ఆ 7 ప్రాజెక్టులకు అనుమతి ఇచ్చిందే కేంద్ర ప్రభుత్వం.. ఆ అనుమతులు రద్దు చేయాలని ఏపీ ప్రభుత్వం పట్టుబడితే జీఆర్ఎంబీ - 2 వ పేజీలో...



# కేసీఆర్‌తోనే అభివృద్ధి

## 6 నెలల్లో బిల్లులిస్తానని రేవంత్ చెప్పిండు.. పోచారం ఆవేదన

కామారెడ్డి, ఆగస్టు 11 (ఈవార్తలు): బాన్సువాడ ఎమ్మెల్యే, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి.. తన పార్టీ మార్పుపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తాను మంత్రి పదవి కోసమో లేక డబ్బుల కోసం కాంగ్రెస్ కండువా కప్పుకోలేదని తేల్చి చెప్పారు. బాన్సువాడ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడం కోసమే పార్టీ మారాల్సి వచ్చిందని తెలిపారు. కామారెడ్డి జిల్లా బీర్కూరులో కార్యకర్తలు, అభిమానులతో నిర్వహించిన తరువాయి 2 వ పేజీలో...

## రాశి ఫలాలు

12.8.2026

**మేషం:** స్వల్ప అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. వివాదాలకు దూరంగా ఉండటం మంచిది. వృత్తి వ్యాపారాల్లో ఊహించని అవరోధాలు కలుగుతాయి. ఉద్యోగస్తులకు అదనపు పనిభారం ఉంటుంది. నిరుద్యోగుల శ్రమ వృధాగా మిగులుతుంది. ఆర్థికంగా ఆశించిన ఫలితాలు ఉండవు.

**వృషభం:** చిన్ననాటి మిత్రులు ఆగమనం ఆనందం కలిగిస్తుంది. స్థిరాస్తి వ్యవహారాలలో నూతన ఒప్పందాలు చేసుకుంటారు. వృత్తి వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఉద్యోగస్తులకు జీతభత్యాల విషయంలో శుభవార్తలు అందుతాయి. జీవిత భాగస్వామితో దైవ దర్శనాలు చేసుకుంటారు.

**మిధునం:** ఉద్యోగాలలో మీ పనితీరుతో అందరిని ఆకట్టుకుంటారు. స్నేహితుల సహాయంతో ఋణ సమస్యలు నుండి బయటపడతారు. సోదరులతో వివాదాలు పరిష్కారమౌతాయి. వృత్తి వ్యాపారాలలో అనుకూల వాతావరణం ఉంటుంది. నిరుద్యోగులకు నూతన అవకాశాలు అందుతాయి.

**కర్కాటకం:** వృత్తి వ్యాపారాలు మరింత నిరుత్సాహ పరుస్తాయి. చేపట్టిన కార్యక్రమాలు మందకొడిగా సాగుతాయి. కుటుంబ వ్యవహారాలలో తొందరపాటు నిర్ణయాలు చెయ్యడం మంచిది కాదు. ఉద్యోగ వాతావరణం అంతగా అనుకూలించదు. సంతాన ఆరోగ్య విషయంలో జాగ్రత్త వహించాలి.

**సింహం:** నూతన ఋణ ప్రయత్నాలు చేస్తారు. సన్నిహితులతో మాటపట్టింపులు తప్పవు. వృధా ఖర్చుల విషయంలో పునరాలోచన చెయ్యాలి. కుటుంబ సభ్యుల ప్రవర్తన ఆందోళన కలిగిస్తుంది. వృత్తి ఉద్యోగాలలో బాధ్యతలు పెరగటం వలన తగినంత విశ్రాంతి లభించదు. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు.

**కన్య:** అనుకున్న పనులు అనుకున్న విధంగా పూర్తి చేస్తారు. సమాజంలో గౌరవ మర్యాదాలు పెరుగుతాయి. ఆకస్మిక ధనలాభం కలుగుతుంది. వ్యాపారానికి నూతన పెట్టుబడులు అందుతాయి. వృత్తి ఉద్యోగాలలో పని ఒత్తిడి నుండి ఉపశమనం లభిస్తుంది. చాలాకాలంగా వేదిస్తున్న సమస్యల నుండి బయటపడతారు.

**తుల:** నేత్ర అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. ఇతరుల విషయాల్లో జోక్యం చేసుకోవడం మంచిది కాదు. గృహమున కొందరి ప్రవర్తన మానసిక అశాంతి కలిగిస్తుంది. వృత్తి వ్యాపారాలలో లాభాలు అందుకోవడానికి మరింత కష్టపడాలి. ఉద్యోగ విషయాల్లో అధికారూలతో జాగ్రత్తగా వ్యవహరించాలి.

**వృశ్చికం:** ఆదాయ మార్గలు సంతృప్తి కలిగిస్తాయి. ఇంటా బయట అనుకూల వాతావరణం ఉంటుంది. కుటుంబ సభ్యుల సహకారంతో ముఖ్యమైన కార్యక్రమాలు పూర్తిచేస్తారు. వృత్తి వ్యాపారాలలో నూతన పెట్టుబడులు అందుతాయి. ఉద్యోగస్తులకు అదనపు బాధ్యతలు ఉన్నపటికీ సమర్ధవంతంగా నిర్వహిస్తారు.

**ధనస్సు:** సోదరులతో స్థిరాస్తి వివాదాలు చికాకు పరుస్తాయి. వృత్తి వ్యాపారాలలో మరింత నిరుత్సాహ వాతావరణం ఉంటుంది. నిరుద్యోగులకు లభించిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలపై దృష్టి సారిస్తారు. వాహన ప్రయాణాలలో జాగ్రత్త వహించడం మంచిది.

**మకరం:** ముఖ్యమైన పనులలో అప్రయత్న కార్యసిద్ధి కలుగుతుంది. నూతన వాహన కొనుగోలు ప్రయత్నాలు ఫలిస్తాయి. వృత్తి వ్యాపారాలు పుంజుకుని మరింత ముందుకు సాగుతాయి. ధన వ్యవహారాలు ఆశాజనకంగా ఉంటాయి. ఉద్యోగస్తులకు అధికారుల అనుగ్రహంతో అనుకూల మార్పులు చోటుచేసుకుంటాయి.

**కుంభం:** నిరుద్యోగుల కలలు సాకారమౌతాయి. చిన్ననాటి మిత్రుల నుండి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. భూ క్రయ విక్రయాలు అనుకూలంగా సాగుతాయి. వ్యాపారాలలో మరింత ఉత్సాహంగా పని చేసి లాభాలు అందుకుంటారు. చేపట్టిన పనులు అప్రయత్నంగా పూర్తవుతాయి.

**మీనం:** ముఖ్యమైన వ్యవహారాలు వాయిదా వెయ్యడం మంచిది. బంధు మిత్రులతో అకారణ వివాదాలు కలుగుతాయి. నూతన వ్యాపారాలకు పెట్టుబడులు పెట్టె విషయంలో పునరాలోచన చెయ్యడం మంచిది. ఉద్యోగస్తులకు సహోద్యోగులతో మాటపట్టింపులు ఉంటాయి. వృధా ఖర్చులు పెరుగుతాయి.

# ప్లాస్టిక్ నోట్లకు కేంద్రం ఆమోదం

**మొదటి పేజీ తరువాయి**

కాగితపు నోట్లను ఉపసంహరించే ఉద్దేశం ఏదీ లేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ ప్రయోగం విజయవంతమైనా మార్కెట్లో పాత కాగితపు నోట్లు, పాలిమర్ నోట్లు రెండూ సమాంతరంగా చలామణిలో ఉంటాయని తెలిపింది. అయితే, పాలిమర్ నోట్ల తయారీ ప్రక్రియ ప్రస్తుతం ప్రారంభ దశలోనే ఉందని, ఎప్పటి నుంచి అందుబాటులోకి వస్తాయో, అందుకు ఎంత ఖర్చు అవుతుందో ఇప్పుడే స్పష్టంగా చెప్పలేమని ఆర్థిక మంత్రి తన లిఖితపూర్వక సమాధానంలో వెల్లడించారు. కాగితపు నోట్లు నీరు, చెమట, నలిగిపోవడం వల్ల త్వరగా చిరిగిపోవడం లేదా మురికిగా మారిపోవడం జరుగుతోంది. కానీ పాలిమర్ నోట్లు 2.5 నుంచి 4 రెట్లు ఎక్కువ కాలం మన్నికగా ఉంటాయి. రూ.10, రూ.20 వంటి తక్కువ విలువ కలిగిన నోట్లు చేతులు మారే వేగం ఎక్కువ. పాలిమర్ నోట్లు సింథటిక్ ప్లాస్టిక్ మెటీరియల్‌తో తయారు కావడం వల్ల నీటిలో తడిచినా లేదా మురికి పట్టినా పాడవ్వవు. పాలిమర్ నోట్లలో పారదర్శక విండోలు, సంక్లిష్టమైన సెక్యూరిటీ ఫీచర్లను చేర్చవచ్చు.



# ‘22-ఏ’ ఆందోళన వద్దు

**మొదటి పేజీ తరువాయి**

అధికారులను పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశించారు. భూముల రెగ్యులరైజేషన్‌కు సంబంధించిన జీవోలు, ఉత్తర్వులు, మెమోలు, భూసేకరణ ప్రొసీడింగ్స్, లేఅవుట్ అనుమతులు సహా అన్ని రికార్డులను ఈనెల 14వ తేదీలోగా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ విధానం ద్వారా బోగస్ లేదా ఫోర్జరీ పత్రాలను గుర్తించడంతో పాటు రిజిస్ట్రేషన్ ప్రక్రియలో మరింత పారదర్శకత తీసుకురావచ్చని మంత్రి చెప్పారు. పహానీలను కూడా సబ్ రిజిస్ట్రార్లకు అందుబాటులో ఉంచేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. నిషేధిత జాబితాలోని ఆస్తుల రిజిస్ట్రేషన్ దరఖాస్తులను సబ్ రిజిస్ట్రార్లు గుడ్డిగా తిరస్కరించకూడదని పొంగులేటి స్పష్టం చేశారు. ఏదైనా దరఖాస్తును తిరస్కరించాల్సిన పరిస్థితి ఉంటే కారణాలను పరిశీలించేందుకు 3 రోజుల సమయం తీసుకుని.. స్పష్టమైన వివరణ ఇవ్వాలని సూచించారు. ప్రతి కేసును విడివిడిగా పరిశీలించి వాస్తవాలను నిర్ధారించాలని ఆదేశించారు. ఇకపై నిషేధిత జాబితాకు సంబంధించిన దరఖాస్తులను తహసీల్దార్లకు పంపకుండా నేరుగా జిల్లా కలెక్టర్లకు పంపించాలని మంత్రి పొంగులేటి నిర్ణయించారు. కలెక్టర్, జిల్లా రిజిస్ట్రార్ స్థాయిలోనే సంబంధిత వ్యవహారాలను సమన్వయం చేయాలని సూచించారు. సబ్ రిజిస్ట్రార్ల విచక్షణాధికారాలను పరిమితం చేసి.. ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్న ధ్రువీకరించిన వివరాల ఆధారంగానే రిజిస్ట్రేషన్‌పై నిర్ణయం తీసుకునే విధంగా వ్యవస్థను రూపొందించాలన్నారు. ప్రభుత్వ భూములు, ఆస్తుల పరిరక్షణ విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ ఉండదని మంత్రి పొంగులేటి తేల్చి చెప్పారు. అదే సమయంలో 22ఏ నిబంధనల పేరుతో చట్టబద్ధంగా హక్కు ఉన్న పేదలు, సాధారణ ప్రజలకు అన్యాయం జరిగితే సహించబోమని స్పష్టం చేశారు. ఉద్దేశపూర్వకంగా తప్పులు చేసే అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజావాణి, కలెక్టర్లు, ఆర్డీవోలు, తహసీల్దార్లు, సబ్ రిజిస్ట్రార్లకు వచ్చిన 22ఏ, పీఓబీ దరఖాస్తులను ప్రతిరోజూ సమీక్షించాలని కలెక్టర్లను ఆదేశించారు. సమస్య వచ్చిన తర్వాత పరిష్కరించడం కంటే ముందుగానే లోపాలను గుర్తించి ప్రజలకు ఇబ్బందులు రాకుండా చూడటం అధికారుల బాధ్యత అని సూచించారు.

## ఖేలో ఇండియా.. మన ఖలేజా!

**మొదటి పేజీ తరువాయి**

ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ప్రారంభోత్సవ, ముగింపు వేడుకలకు సంబంధించిన ముఖ్య అతిథులు, ప్రముఖ క్రీడాకారులు, సినీ ప్రముఖులను కార్యక్రమాల్లో భాగస్వాములను చేసేందుకు ఇప్పటి నుంచే కసరత్తు ప్రారంభించాలన్నారు. మౌలిక వసతులు, క్రీడల నిర్వహణ, అతిథులకు కావాల్సిన సౌకర్యాల ఏర్పాట్లకు సంబంధించి పని విభజన చేసుకుని బాధ్యత తీసుకోవాలని తెలిపారు. తెలంగాణకు చెందిన అర్జున అవార్డు గ్రహీతలు, తెలంగాణ స్పోర్ట్స్ హబ్ బోర్డు సభ్యులు, ఒలింపిక్స్ అసోసియేషన్ తో పాటు జాతీయస్థాయి క్రీడా ప్రతినిధులను కార్యక్రమంలో భాగస్వాములను చేయాలని అధికారులకు సూచించారు. ఇందుకు సంబంధించి ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధం చేయాలని తెలిపారు. ఖేలో ఇండియా యూత్ గేమ్స్ లో భాగంగా 20 రకాల స్పోర్ట్స్ కు సంబంధించిన పోటీలు నిర్వహించనున్న నేపథ్యంలో.. క్రీడా విభాగాల వారీగా పోటీ ప్రదేశాలను గుర్తించి ఏర్పాట్లు చేయాలన్నారు. క్రీడా స్ఫూర్తిని చాటేలా నిర్వహణ ఉండాలని తెలిపారు.

## రావయ్యా.. రాహుల్!

**మొదటి పేజీ తరువాయి**

మీడియాతో మాట్లాడారు. రేవంత్‌రెడ్డి, రాహుల్ గాంధీపై తనదైన శైలిలో విరుచుకుపడ్డారు. ‘రాహుల్ గారు.. గాంధీ తెలంగాణకు రండి. అశోక్ నగర్‌లో ప్రకటించిన జాబ్ క్యాలెండర్ ప్రకటించారు. మీ జాబ్ క్యాలెండర్ ఎక్కడ పోయింది? ఎక్కడ పోయినయ్ మీ రెండు లక్షల ఉద్యోగాలు? ఎక్కడ పోయినయ్ మీ ఫీ రీయింబర్స్‌మెంట్? మా నాయకులు ఇప్పటికీ నాలుగు లక్షల సంతకాలు తీసుకున్నరు. వాళ్ల మీద లాఠీచార్జ్ చేశారు. రేవంత్‌రెడ్డి అక్కడ లాఠీచార్జ్‌ని వ్యతిరేకిస్తడు.. ఇక్కడనేమో లాఠీచార్జ్ చేయిస్తడు. ఇదేం పద్ధతి? ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద కాక్రోచ్ నిరసనను చూశాం. ఆ నిరసనలో 90 శాతం మంది బయటి వాళ్లే ఉన్నారు. వారు దేశానికి వ్యతిరేకంగా స్లోగన్స్ ఇచ్చారు. జార్ఖండ్‌లో నిరసన తెలుపుతున్న వాళ్లలో అందరూ స్టూడెంట్సే ఉన్నారు. ఇక్కరు కూడా బయటి వాళ్లు లేరు. ఏ రాజకీయ పార్టీ ప్రమేయం లేదు అక్కడ. విద్యార్థి నాయకుడి ఆరోగ్య పరిస్థితి బాలేకుంటే రాహుల్ గాంధీ ఎందుకు ఖండించలేదు, స్పందించలేదు. సోనమ్‌వాంగ్‌చుక్, నడ్డా గారు వెళ్లి మాట్లాడారు. జార్ఖండ్ విద్యార్థులు సీరియస్‌గా కొట్లాడుతున్నారు.

## ‘స్మార్ట్’ కార్డులు..1,06,28,092

**మొదటి పేజీ తరువాయి**

3.43 కోట్ల మంది లబ్ధిదారులు ఉన్నారని మంత్రి తెలిపారు. అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి నెలకు ఆరు కిలోల సన్నబియ్యాన్ని ప్రభుత్వం ఉచితంగా అందిస్తోందన్నారు. స్మార్ట్ రేషన్ కార్డుల అమలుతో ప్రజా పంపిణీ వ్యవస్థలో పారదర్శకత, సామర్థ్యం పెరగడంతో పాటు లబ్ధిదారులకు మరింత సౌలభ్యం కలుగుతుందని చెప్పారు. 2025 జనవరి 26 నుంచి ఇప్పటి వరకు 16,32,810 కొత్త ఆహార భద్రత కార్డులను జారీ చేసినట్లు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. వీటి ద్వారా 61,08,544 మందికి ఆహార భద్రత పరిధిలోకి వచ్చినట్లు తెలిపారు. 2026 ఆగస్టు నాటికి రాష్ట్రంలో మొత్తం ఆహార భద్రత కార్డుల సంఖ్య 1.06 కోట్లకు చేరిందన్నారు. రాష్ట్రంలో ఆహార భద్రత కార్యక్రమం విస్తృతికి ప్రభుత్వం చేస్తున్న వ్యయమే నిదర్శనమని మంత్రి పేర్కొన్నారు. రేషన్ బియ్యం కోసం ఏటా సుమారు రూ.14 వేల కోట్లు, రైతుల నుంచి ధాన్యం కొనుగోలుకు మరో రూ.20వేల కోట్ల వరకు ప్రభుత్వం ఖర్చు చేస్తోందని తెలిపారు. సంగారెడ్డి కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. లబ్ధిదారుల తరలింపు, సీటింగ్, భద్రత, కార్డుల పంపిణీతో పాటు సీఎం పర్యటనకు సంబంధించిన ప్రతి అంశాన్నీ ముందుగానే పకడ్బందీగా ప్రణాళిక చేయాలని సూచించారు. కార్యక్రమానికి మినిట్-టు-మినిట్ షెడ్యూల్ సిద్ధం చేసి.. నిర్దేశిత సమయంలో కార్యక్రమాన్ని పూర్తి చేయాలన్నారు. సమాజంలోని వివిధ వర్గాలకు చెందిన వాస్తవ లబ్ధిదారులను గుర్తించి ముఖ్యమంత్రి చేతుల మీదుగా స్మార్ట్ రేషన్ కార్డులు అందించాలని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా కార్డుల పంపిణీ సందర్భంగా లబ్ధిదారుల గుర్తింపును ధ్రువీకరించి, పూర్తి పారదర్శకతతో కార్డులు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

### ప్రతి అర్హుడికీ ఆహార భద్రతే లక్ష్యం

తెలంగాణలో 1.06 కోట్ల ఆహార భద్రత కార్డుల ద్వారా 3.43 కోట్ల మందికి ఆహార భద్రత కల్పిస్తున్నామని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ప్రతి అర్హుడికి నెలకు ఆరు కిలోల సన్నబియ్యాన్ని ఉచితంగా అందిస్తున్నామని చెప్పారు. ఇంత విస్తృతమైన సంక్షేమ కార్యక్రమాన్ని మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా లబ్ధిదారుడి చెంతకు చేర్చడమే స్మార్ట్ రేషన్ కార్డుల ఉద్దేశమని పేర్కొన్నారు. ఆహార భద్రత కార్యక్రమం విస్తృతిని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియా వేదికలను వినియోగించాలని మంత్రి అధికారులకు సూచించారు. 1.06 కోట్ల కార్డులు, 3.43 కోట్ల లబ్ధిదారులు, ఉచిత సన్నబియ్యం వంటి అంశాలతో పాటు షార్ట్ వీడియోలు, రీల్స్ ద్వారా విస్తృత ప్రచారం చేపట్టాలని ఆదేశించారు.

# బాబూ.. మా రైతుల కడుపు కొట్టకు

**మొదటి పేజీ తరువాయి**

మీటింగ్ ఎజెండాలో పెట్టారు. కేంద్రం నా చెప్పుచేతుల్లో ఉంది.. నేను ఆడించినట్టే ఆడాలని చంద్రబాబు అనుకుంటే ఏపీ ప్రభుత్వానికి, సీఎం చంద్రబాబుకు కూడా విజ్ఞప్తి చేస్తున్నా.. బేసిన్లు లేవు, భేషజాలు లేవు అని కేసీఆర్ ఆనాడే చెప్పారు. కానీ మా కడుపుకొట్టి మా ప్రాజెక్టులను రద్దు చేస్తామంటే ఊరుకోం. మీరు పోలవరం కట్టుకుంటే మేం ఏమన లేదు. మీరు పట్టిసీమ నీళ్లు లిఫ్ట్ చేసుకుంటుంటే మేం ఏమనలేదు. మా ప్రాజెక్టుల అనుమతులను రద్దు చేయ కండి అంటున్నం. కేంద్రం జుట్టు మా చేతుల్లో ఉంది కదా. నేను ఆడించినట్టు ఆడే తెలంగాణ సీఎం ఉన్నాడు అనుకుంటే, తెలంగాణలో రైతుల తరఫున మేము పోరాడుతాం. జల ఉద్యమం చేపడతాం’ అని కేటీఆర్ ఉద్ఘాటించారు. ‘8 ప్లస్ 8 = 0 అని మేము ఉత్తగనే అనలేదు. పలు రాష్ట్రాల్లో సాగునీటి ప్రాజెక్టులకు జాతీయ హోదా ఇచ్చారు. పాలమూరు – రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వం అని కేంద్ర ప్రభు త్వం నిన్న పార్లమెంట్‌లో చెప్పినా బీజేపీ, కాంగ్రెస్ ఎంపీలు మౌనంగా ఉన్నారు. బీఆర్ఎస్ ఎంపీలు ఉంటే ఈ అంశంపై పార్లమెంట్‌లో పోరాడేవాళ్లు’ అని పేర్కొన్నారు.

## కూలీ బతుకులు..కూలిపాయే!

**మొదటి పేజీ తరువాయి**

జహీరాబాద్ వైపు అతివేగంగా దూసుకొచ్చిన ఓ ట్యాంకర్ వారిని బలంగా ఢీకొట్టింది. ట్యాంకర్ వేగం ఎక్కువగా ఉండటంతో ఆటో నుజ్జునుజ్జైంది. ఈ ప్రమాదంలో ఏడుగురు కూలీలు ఘటనాస్థలంలోనే ప్రాణాలు కోల్పోయారు. రక్తపు మడుగులో పడివున్న క్షతగాత్రులను, చెల్లాచెదురుగా పడి ఉన్న మృతదేహాలను చూసి స్థానికులు వెంటనే పోలీసులకు, అంబులెన్స్‌కు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. తీవ్రంగా గాయపడిన మరో ఐదుగురిని చికిత్స నిమిత్తం జహీరాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. వీరిలో ముగ్గురి పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్లు సమాచారం. దీంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని వైద్యులు భావిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. ప్రమాదంపై సీఎం రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సాన-ుభూతి వ్యక్తం చేశారు. గాయపడినవారికి మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

# తెలంగాణ ఓటర్లు.. 2,64,87,214

**మొదటి పేజీ తరువాయి**

ఉన్నవారు – 6,70,203, ఇతరులు – 1,02,294 మంది’ అని తెలిపారు. ఓటరు జాబితాను మరింత పారదర్శకంగా, కచ్చితంగా రూపొందించేందుకు సర్ ప్రక్రియ చేపట్టినట్లు ఆయన తెలిపారు. అర్హులైన ఓటర్ల పేర్లు కొనసాగిస్తూ.. శాశ్వతంగా తరలివెళ్లిన వారు, మరణించిన వారు, ఇతర చోట్ల నమోదైన వారి వివరాలను నిబంధనల ప్రకారం పరిశీలించనున్నట్లు వెల్లడించారు. తెలంగాణలో సర్ ప్రక్రియలో వెలువడిన ఈ గణాంకాలు రాష్ట్ర ఓటరు జాబితాలో పెద్ద ఎత్తున మార్పులు చోటుచేసుకుంటున్న విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. 73 లక్షలకు పైగా ఫారాలు అన్‌కలెక్టబుల్‌గా నమోదు కావడం ఇటు రాజకీయ వర్గాల్లోనూ చర్చకు దారితీస్తోంది.

## పాన్ మసాలా ప్యాకింగ్‌లో ప్లాస్టిక్ నిషేధం

**మొదటి పేజీ తరువాయి**

పాలిమర్లను, లామినేట్స్‌ను ప్యాకింగ్‌లో వాడకూడదు. ప్లాస్టిక్‌తో పాటు అల్యూమినియం ఫాయిల్, ఇతర మెటలైజ్డ్ లేయర్లతో కూడిన ప్యాకింగ్‌ను కూడా పూర్తిగా నిషేధించింది. కాగితం కవర్లతో పాటు టిన్ డబ్బాలు, గ్లాస్ కంటైనర్లలో పాన్ మసాలాను విక్రయించుకోవచ్చని వెల్లడించింది. ఈ మేరకు పర్యావరణ పరిరక్షణ చట్టం పరిధిలోని ‘ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ రూల్స్–2016’కు లోబడి ఉంటాయని ఎఫ్ఎస్ఎస్ఏఐ సీఈఓ రజిత్ పున్హానీ స్పష్టం చేశారు. అయితే, ఈ కొత్త ప్యాకేజింగ్ నిబంధనలకు సంబంధించి ఏప్రిల్ 28న ముసాయిదాను విడుదల చేసిన విషయం తెలిసిందే. ప్రజలు, వ్యాపారుల నుంచి అభ్యంతరాలు, సలహాలు స్వీకరించిన అనంతరం కేంద్ర ప్రభుత్వ ఆమోదంతో మంగళవారం తుది నోటిఫికేషన్‌ను గెజిట్‌లో ప్రచురించారు.

# కేసీఆర్‌తోనే అభివృద్ధి

**మొదటి పేజీ తరువాయి**

ఆత్మీయ సమావేశంలో మాట్లాడిన పోచారం.. మాజీ సీఎం కేసీఆర్‌తో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ భావోద్వేగ వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్‌ను మోసం చేసి బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్ పార్టీలోకి మారడం తనకు ఎంతమాత్రం ఇష్టం లేదని పోచారం శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. అయితే నియోజకవర్గ అభివృద్ధి కోసం.. పెండింగ్‌లో ఉన్న పనులకు నిధులు రావాలనే ఉద్దేశంతోనే కాంగ్రెస్‌లో చేరాల్సి వచ్చిందని వివరించారు. తాను స్వార్థ ప్రయోజనాల కోసం పార్టీ మారలేదని మరోసారి వెల్లడించారు. అన్నం పెట్టిన వాళ్లను ఎప్పటికీ మర్చిపోలేనని పేర్కొన్న పోచారం శ్రీనివాస్ రెడ్డి.. కేసీఆర్ హయాంలోనే బాన్సువాడ నియోజకవర్గంలో అభివృద్ధి జరిగిందని పేర్కొన్నారు. కొంతమంది కారణంగానే తాను పార్టీ మారాల్సిన పరిస్థితి వచ్చిందని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ కండువా కప్పుకునే సమయంలో బాన్సువాడ నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనుల బిల్లులను 6 నెలల్లో మంజూరు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని పోచారం శ్రీనివాస్ రెడ్డి గుర్తు చేసుకున్నారు. అయితే తాను పార్టీ మారిన తర్వాత ఇప్పటివరకు సగం నిధులు మాత్రమే మంజూరయ్యాయని ఆరోపించారు. బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో గుత్తేదారులు పనులు నిలిపివేశారని.. దీంతో నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు ఆటంకం ఏర్పడిందని ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. నిధుల కోసం సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కోరినా ఆశించిన స్థాయిలో స్పందన రాలేదన్నారు. గతేడాది నవంబర్‌లో ఫిరాయింపు ఎమ్మెల్యేలతో సీఎం రేవంత్‌రెడ్డి సమావేశం నిర్వహించిన సమయంలో తాను సూటిగా ప్రశ్నించినట్లు పోచారం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ‘నేను నీకు అమ్ముడుపోయానా.. లేక నా ఎమ్మెల్యే పదవిని కొన్నావా?’ అని తాను సీఎం రేవంత్ రెడ్డిని నిలదీసినట్లు వెల్లడించారు. తన నియోజకవర్గానికి రావాల్సిన నిధుల గురించి మాట్లాడేందుకు ప్రయత్నించినా సీఎం రేవంత్ రెడ్డి గానీ.. మంత్రులు తన ఫోన్ కాల్స్ కూడా ఎత్తడం లేదని పోచారం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి కూడా ఫోన్ ఎత్తడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తాను కాంగ్రెస్ పార్టీ జెండా కప్పుకోలేదని.. కేవలం జాతీయ జెండా భావనతోనే ముందడుగు వేశానని పోచారం శ్రీనివాస్ రెడ్డి వ్యాఖ్యానించారు. బాన్సువాడ



నియోజకవర్గ అభివృద్ధి కోసమే తాను ఈ నిర్ణయం తీసుకున్నానని.. కానీ ప్రస్తుతం నియోజకవర్గంలో అభివృద్ధి పనులు నెమ్మదించాయని.. అయినప్పటికీ కార్యకర్తలు అధైర్యపడాల్సిన అవసరం లేదని ధైర్యం చెప్పారు. రాబోయే రోజుల్లో బాన్సువాడలో మళ్లీ తమదే విజయమని ధీమా వ్యక్తం చేశారు.

# 30 టీఎంసీల నీటిని వెంటనే ఎత్తిపోయండి

**సిద్దిపేట కలెక్టర్‌కు హరీశ్‌రావు లేఖ**






సిద్దిపేట, ఆగస్టు 11 (ఈవార్తలు): సాగు నీటి కోసం రైతులు కళ్లు కాయలు కాసేలా ఎదురు చూస్తున్నారని.. సిద్దిపేట జిల్లాలోని రిజర్వాయర్లకు 30 టీఎంసీల నీటిని వెంటనే ఎత్తిపోయాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు డిమాండ్ చేశారు. రిజర్వాయర్ల దుస్థితి చూస్తే దుఃఖం వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈమేరకు ఆయన సిద్దిపేట కలెక్టర్, ఇరిగేషన్ అడ్వైజరి కమిటీకి లేఖ రాశారు. జిల్లాలో వచ్చే ఏడాది జూలై నాటికి సాగు, తాగు నీటి కొరత లేకుండా చూడాలని కోరారు. రైతులు ఇబ్బందులు పడకుండా ఇరిగేషన్, వ్యవసాయ అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. సిద్దిపేట జిల్లాలో వచ్చే వానాకాలం వరకు జిల్లా రైతులకు, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా మళ్లీ వేసవిలో నీటిని ఎత్తిపోయడానికి మిడ్ మానేరులో సరిపడా నీళ్లను నిల్వ చేసేలా చర్యలు చేపట్టాలి. మంగళవారం సిద్దిపేట కలెక్టర్ కార్యాలయంలో జిల్లా ఇరిగేషన్ అడ్వైజరీ కమిటీ చైర్మన్, జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగే సమావేశం సందర్భంగా పలు అంశాలను కమిటీ దృష్టికి తీసుకెళ్లిందుకు లేఖ రాశాను. ఎల్‌నినో ప్రభావంతో జిల్లా స్థాయిలో ఇరిగేషన్ కమిటీ సమావేశాన్ని నిర్వహిస్తున్న నేపథ్యంలో కొన్ని అంశాలు ప్రస్తావిస్తున్నాను. ఈ అంశాలపై తక్షణమే చర్యలు చేపడితే వచ్చే వానాకాలం వరకు ఎల్‌నినో ప్రభావాన్ని అధిగమించొచ్చు అని ఆ లేఖలో తెలిపారు. కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టులో భాగంగా సిద్దిపేట జిల్లాలో అన్నపూర్ణ, రంగనాయకసాగర్, కొమురవెల్లి మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ రిజర్వాయర్లను నిర్మించుకున్నాం. ఏటా ఈ సమయం వరకే రిజర్వాయర్లలోకి రాజన్న సిరిసిల్ల జిల్లాలోని మిడ్ మానేరు రిజర్వాయర్ నుండి నీటిని ఎత్తిపోయడం జరిగేది. కానీ ఈసారి ఇంకా ఎత్తిపోతలు ప్రారంభించలేదు. అన్నపూర్ణ, రంగనాయకసాగర్ రిజర్వాయర్లు ప్రస్తుతం డెడ్ స్టోరేజీలో ఉన్నాయి. వీటిని వెంటనే నింపాల్సి ఉంది. అదే విధంగా కొమురవెల్లి మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ రిజర్వాయర్లు అడుగంటే పరిస్థితిలో ఉన్నాయి అని మాజీ మంత్రి ఆవేదన చెందారు. ఈ రిజర్వాయర్లలోకి తక్షణమే 30 టీఎంసీల నీటిని ఎత్తిపోసి చెరువులు, కుంటలు, చెక్ డ్యాంలు నింపాలి. దీనివల్ల భూగర్భ జలాలు పెరిగి ఈ వానాకాలం పంటల సీజన్లో జిల్లాలోని రైతులకు ప్రయోజనంగా ఉంటుంది. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ సంవత్సరం 65 శాతం మంది రైతులే వానాకాలం పంటలు సాగు చేశారు. మిగతా వారు సాగునీళ్లు లేవనే ఉద్దేశంతో మంచి భూములను బీడుగా ఉంచారు. ప్రస్తుతం సాగవుతున్న పంటలు గట్టెక్కాలన్నా ఈ రిజర్వాయర్లను నింపడమే శరణ్యం అని లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు. 2027, జూలై నెల వరకు ఎల్‌నినో ప్రభావం ఉంటుందని ప్రభుత్వం చెబుతున్నది. అప్పటివరకు సాగునీరు, తాగునీటికి కొరత రాకుండా ఉండాలంటే ఇప్పటికిప్పుడు రిజర్వాయర్లలోకి ఎత్తిపోతలు ప్రారంభించాలి. ఈ నీళ్ల వినియోగం పూర్తయితే మళ్లీ ఎత్తి పోయడానికి మిడ్ మానేరు రిజర్వాయర్‌లో జిల్లాకు సరిపడా నీటిని స్టోరేజీ చేసి ఉంచాలి. యాసంగి పంట కాలం సమయంలో అవసరానికి లిఫ్ట్ చేసుకొనే విధంగా నీటిపారుదల శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలి అని ఆయన అన్నారు. సుమారు 6 నుండి 7 టీఎంసీల నీళ్లు తాగునీటి అవసరాలకే వినియోగించాల్సి ఉంటుంది. వరి, పామాయిల్, ఇతర పంటలు సాగుచేసిన రైతులు నీటి ఎత్తిపోతల కోసమే ఎదురుచూస్తున్నారు. రిజర్వాయర్ల దుస్థితి చూస్తే మాత్రం దుఃఖం వస్తోంది. గోదావరిలో ప్రవాహం ఉన్నప్పుడే వడివడిగా నీటిని ఎత్తిపోస్తే ఈ పరిస్థితి వచ్చేది కాదు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలి. జిల్లాలోని రైతులకు ఏ కష్టం రాకుండా వ్యవసాయ, నీటిపారుదల శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలి అని హరీశ్‌రావు సూచించారు.

## ‘కంటి వెలుగు’ బాధితులకు 5 లక్షలు

**హనుమకొండ జయా ఆస్పత్రి కేసులో పరిహారం**

**మానవ హక్కుల కమిషన్ కీలక ఆదేశాలు**

హనుమకొండ/హైదరాబాద్, ఆగస్టు 11 (ఈవార్తలు): 2018లో హనుమకొండలోని జయా ఆస్పత్రిలో ‘కంటి వెలుగు’ ఆపరేషన్లు వికటించి 18 మంది తమ చూపు కోల్పోయారు. ఈ ఘటనపై సుమోటోగా విచారణ జరిపిన తెలంగాణ మానవ హక్కుల కమిషన్ తాజాగా బాధిత కుటుంబాలకు పరిహారం ప్రకటించింది. ప్రస్తుతం జీవించి ఉన్న 12 మందికి రూ.4 లక్షల చొప్పున, మరణించిన 6 మంది కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం చెల్లించాలని ఆదేశించింది. ఆస్పత్రిలో స్టెరిలైజేషన్, ఇన్‌ఫెక్షన్ నియంత్రణ లేకపోవడం వల్లే ఈ ఘోరం జరిగిందని కమిషన్ నిర్ధారించింది. డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్ నేతృత్వంలోని కమిషన్.. ఆరోగ్య శాఖ నివేదికలు, ఎల్.వి. ప్రసాద్ కంటి ఆసుపత్రి డాక్టర్ల రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించింది. జయా ఆసుపత్రిలోని ఆపరేషన్ థియేటర్ నిర్వహణ, స్టెరిలైజేషన్ తదితర విషయాల్లో ఘోరమైన వైఫల్యం ఉన్నట్లు తేల్చింది. ఆపరేషన్ సమయంలో వాడిన పరికరాలు శుభ్రంగా లేకపోవడం వల్లే రోగుల కళ్లలో ‘ఎంటెరోబాక్టర్ క్లోకే’ అనే ప్రమాదకరమైన ఇన్‌ఫెక్షన్ వ్యాపించిందని కమిషన్ నిర్ధారించింది. దీని వల్ల 18 మంది అమాయకులు తమ కంటి చూపును కోల్పోయి తీవ్ర శారీరక, మానసిక క్షోభకు గురయ్యారు. ఇది రాజ్యాంగం కల్పించిన జీవించే హక్కును తీవ్రంగా ఉల్లంఘించడమేనని కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది.

## పింగళి వెంకయ్యకు భారతరత్నే అసలైన గౌరవం: వీహెచ్



హైదరాబాద్, ఆగస్టు 11 (ఈవార్తలు): భారత జాతీయ పతాకాన్ని రూపొందించిన మహనీయుడు పింగళి వెంకయ్యకు అత్యున్నత పౌర పురస్కారమైన ‘భారతరత్న’ ప్రకటించాలని తెలంగాణ బీసీ సంక్షేమ శాఖ సలహాదారుడు, కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు డిమాండ్ చేశారు. కోట్లాది మంది ప్రజల గుండెల్లో నిలిచిన త్రివర్ణ పతాకాన్ని అందించిన గొప్ప స్వాతంత్ర్య సమరయోధుడికి భారత ప్రభుత్వం ఇవ్వగల ఏకైక సముచితమైన నివాళి భారతరత్న మాత్రమేనంటూ ఆయన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి ఓ బహిరంగ లేఖ రాశారు. కేంద్ర ప్రభుత్వం ప్రచారం చేస్తున్న ‘హర్ ఘర్ తిరంగా’ పిలుపును స్వాగతిస్తూనే... జాతీయ జెండా రూపకర్త విషయంలో కేంద్రం చూపుతున్న నిర్లక్ష్యాన్ని వీహెచ్ ఎండగట్టారు. దేశమంతటా త్రివర్ణ పతాకం సగర్వంగా రెపరెపలాడుతున్నప్పుడు, దానికి ప్రాణం పోసిన తెలుగు నేల ముద్దుబిడ్డ పింగళి వెంకయ్య సేవలను ప్రధాని మోదీ ఎందుకు విస్మరిస్తున్నారో అర్థం కావడం లేదని ఘాటుగా ప్రశ్నించారు. పింగళి వెంకయ్యకు భారతరత్న ఇస్తేనే ప్రతి భారతీయుడికి, సమరయోధుల త్యాగాలకు సరైన గౌరవం దక్కుతుందని స్పష్టం చేశారు. గతంలోనే తాను హైదరాబాద్‌లో పింగళి వెంకయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తుచేస్తూ, ఇప్పటికైనా కేంద్రం స్పందించి ఈ మహత్తర నిర్ణయం తీసుకోవాలని లేఖలో కోరారు.

## సీఎం సోదరులు.. షెల్ దొంగలు

**షెల్ కంపెనీలతో లబ్ధి పొందుతున్నారు**

**టెసరాక్ కంపెనీకి రూ.200 కోట్ల భూమి కేటాయింపు**

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపణలు**

హైదరాబాద్, ఆగస్టు 11 (ఈవార్తలు):ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరులు నామమాత్రపు అర్హతలతో భారీ కంపెనీలను రిజిస్టర్ చేస్తూ, రాష్ట్ర ప్రభుత్వం ద్వారా పెద్ద ఎత్తున లబ్ధి పొందుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆరోపణలు చేశారు. తెలంగాణ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి సోదరులు బడా కంపెనీలకు యజమానులుగా మారుతున్నారని కేటీఆర్ ఆరోపించారు. కనీసం ఒక్క ఉద్యోగి కూడా లేని కంపెనీలను చిన్న నివాసాల చిరునామాలతో రిజిస్టర్ చేయించారని పేర్కొన్నారు. అటువంటి ఒక కంపెనీకే దాదాపు రూ. 200 కోట్ల విలువైన ఐదు ఎకరాల భూమిని ప్రభుత్వం కట్టబెట్టిందని విమర్శించారు. ముఖ్యంగా, అనుముల కొండల్ రెడ్డి తన లింక్డ్ఇన్ ప్రొఫైల్‌లో ‘టెసరాక్’ కంపెనీకి చైర్మన్‌గా ఉన్నట్లు పేర్కొన్నారని తెలిపారు. మరో సోదరుడు జగదీశ్ రెడ్డి కాంట్రాక్టులు దక్కించుకుంటుండగా, ముఖ్యమంత్రి బావమరిది సృజన్ రెడ్డికి సింగరేణిలో కాంట్రాక్ట్ కట్టబెట్టారని ఆరోపించారు. ప్రతిపాదిత ఫోర్త్ సిటీ పరిధిలోని భూముల కేటాయింపులపై బీఆర్ఎస్ అధికార ప్రతినిధి మన్నె క్రిశాంక్ ఒకరోజు ముందే ఇవే తరహా ఆరోపణలు చేసిన నేపథ్యంలో కేటీఆర్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. కొండల్ రెడ్డి చైర్మన్‌గా ఉన్న టెసరాక్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు మహేశ్వరం మండలం రావిర్యాలలో సుమారు ఐదు ఎకరాల భూమిని కేవలం రూ. 7 కోట్లకు కేటాయించారని, దాని అసలు మార్కెట్ విలువ రూ. 100 కోట్లకు పైగా ఉంటుందని క్రిశాంక్ పేర్కొన్నారు. ఆ కంపెనీకి కేవలం రూ.లక్ష మూలధనం ఉందని, పటాన్‌చెరులోని ఒక చిన్న నివాసం నుంచి కార్యకలాపాలు సాగిస్తోందని ఆరోపించారు. కాగా, క్రిశాంక్ చేసిన ఆరోపణలను మంత్రి డి.శ్రీధర్ బాబు తీవ్రంగా ఖండించారు.

# కేబీఆర్ పార్కు చుట్టూ వన్ వే

**ఏడాదిన్నర పాటు ట్రాఫిక్ ఆంక్షలు**



హైదరాబాద్, ఆగస్టు 11 (ఈవార్తలు): హైదరాబాద్ నగరంలోని కేబీఆర్ పార్కు చుట్టూ అండర్ పాస్‌లు, ఫ్లై ఓవర్ల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో ట్రాఫిక్ పోలీసులు అలర్ట్ అయ్యారు. ఈ నెల 18 నుంచి కేబీఆర్ పార్కు చుట్టూ వన్ వే అమలు చేయనున్నట్లు నగర పోలీసు కమిషనర్ వీసీ సజ్జనార్ వెల్లడించారు. ఈ వన్ వే కోసం అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు. వాహనదారులు పోలీసులకు సహకరించాలని కోరారు. సుమారు ఏడాదిన్నర పాటు ఈ ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉండనున్నాయి. గతంలో నిర్వహించిన రెండు ట్రయల్ రన్‌ల సందర్భంగా సహకరించినట్టే.. 18 నుంచి కూడా సహకరించాలన్నారు. జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ నుంచి పంజాగుట్ట వైపు వెళ్లే రోడ్డుకు వన్ వే ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ నిర్మాణ పనులు పూర్తయ్యే వరకు వన్ వే అమలులో ఉంటుందని చేశారు. ఎన్ఎఫ్‌సీఎల్, జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వైపు వెళ్లే వాహనదారులను పోలీసులు సూచించిన ప్రత్యామ్నాయ మార్గాల్లోకి మళ్లించనున్నారు. ముఖ్యంగా రద్దీ ఎక్కువగా ఉండే సమయాల్లో వాహనదారులు ట్రాఫిక్ పోలీసుల సూచనలను తప్పనిసరిగా పాటించాలన్నారు. కేబీఆర్ పార్కు చుట్టూ అండర్ పాస్‌లు, ఫ్లై ఓవర్ నిర్మాణం పూర్తయ్యే వరకు ఈ వన్ వేను అమలు చేయాలని ట్రాఫిక్ పోలీస్ ఉన్నతాధికారులు నిర్ణయించారు.


## రేవంత్‌కు ఒకలా.. తమిళనాడుకు మరోలా?

**డీలిమిటేషన్‌పై కాంగ్రెస్ వైఖరి సరికాదు.. డీఎంకే ఎంపీ దయానిధి మారన్ ఫైర్**



చెన్నై: నియోజకవర్గాల పునర్విభజన అంశంపై జాతీయ స్థాయిలో రాజకీయ దుమారం రేగుతోంది. ఈ ప్రక్రియపై కాంగ్రెస్ పార్టీ అనుసరిస్తున్న ద్వంద్వ వైఖరిని డీఎంకే సీనియర్ నేత, ఎంపీ దయానిధి మారన్ తీవ్రంగా ఖండించారు. తమిళనాడులో డీలిమిటేషన్‌ను వ్యతిరేకిస్తూ ఎంపీలతో మీటింగ్‌లు పెడుతున్న కాంగ్రెస్.. తెలంగాణలో తమ సొంత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగంగా దీనికి మద్దతు తెలుపుతున్నా ఎందుకు సైలెంట్‌గా ఉందని ఆయన సూటిగా ప్రశ్నించారు. ఒకవైపు తమిళనాడులో ఎంపీలతో ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తూ డీలిమిటేషన్‌కు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ పెద్ద పొలిటికల్ హైడ్రామా క్రియేట్ చేస్తోందని దయానిధి మారన్ మండిపడ్డారు. “నిజంగా కాంగ్రెస్ స్టాండ్ అదే అయితే, ఆ పార్టీ అధికారంలో ఉన్న మిగతా నాలుగు రాష్ట్రాల్లో ఇలాంటి ఎంపీల సమావేశాలు ఎందుకు నిర్వహించలేదు?” అని ఆయన నిలదీశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకురాబోయే ఈ మార్పులపై కాంగ్రెస్ వైఖరి ఏంటో దేశ ప్రజలకు స్పష్టంగా చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో పరిస్థితులు ఇందుకు పూర్తి భిన్నంగా ఉన్నాయని మారన్ గుర్తుచేశారు. డీలిమిటేషన్ వల్ల తెలంగాణలో అసెంబ్లీ, లోక్‌సభ స్థానాలు భారీగా పెరుగుతాయని, రాష్ట్రానికి మేలు జరుగుతుందని సీఎం రేవంత్ రెడ్డి బహిరంగంగానే ప్రకటించారు. “మరి బీజేపీ సర్కార్ చేస్తున్న ఈ డీలిమిటేషన్ ప్రక్రియకు రేవంత్ రెడ్డి ఎలా మద్దతు ఇస్తారు? ఆయన వ్యాఖ్యలను కాంగ్రెస్ అధిష్టానం ఎందుకు తప్పుబట్టడం లేదు? ఆయన్ని ఎందుకు ప్రశ్నించడం లేదు?” అని మారన్ ఫైర్ అయ్యారు. డీలిమిటేషన్ ప్రక్రియపై జాతీయ స్థాయిలో ఒక స్పష్టమైన, స్థిరమైన విధానం లేని కాంగ్రెస్ పార్టీకి.. తమిళనాడు ప్రజలకు నీతులు చెప్పే నైతిక హక్కు ఏమాత్రం లేదని దయానిధి మారన్ తేల్చి చెప్పారు. కాంగ్రెస్ చేస్తున్నది కేవలం చిల్లర రాజకీయాలు అని అభివర్ణించారు. ఆ పార్టీ ఆడుతున్న ఈ పొలిటికల్ డ్రామాలను తమిళనాడు ప్రజలు ఎట్టిపరిస్థితుల్లోనూ నమ్మరని స్పష్టం చేశారు.

## 23 నుంచి తిరుమలలో పవిత్రోత్సవాలు



తిరుమల, ఆగస్టు 11 (ఈవార్తలు): తిరుమల శ్రీవారి భక్తులకు ముఖ్య గమనిక. తిరుమల శ్రీవారి ఆలయంలో ఆగస్ట్ 23వ తేదీ నుంచి ఆగస్ట్ 25వ తేదీ వరకు పవిత్రోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో పలు ఆర్జిత సేవలను తిరుమల తిరుపతి దేవస్థానం రద్దు చేసింది. ఆగస్ట్ 22వ తేదీ నిర్వహించే అంకురార్పణ కార్యక్రమంతో పవిత్రోత్సవాలు ప్రారంభమవుతాయి. తిరుమ ల శ్రీవారి ఆలయంలో సంవత్సరం పొడువునా అర్చనలు, ఉత్సవాలు నిర్వహిస్తుంటారు. ఈ క్రమంలో భక్తులు, సిబ్బంది వలన తెలియకుండా జరిగే దోషాల నివారణ కోసం, ఈ దోషాల కారణంగా ఆలయ పవిత్రతకు లోపం కలగకుండా ఉండేందుకు, ఆగమ శాస్త్రం ప్రకారం ఏటా పవిత్రోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. ఈ క్రమంలోనే ఆగస్ట్ 23 నుంచి 25వ తేదీ వరకూ మూడు రోజుల పాటు తిరుమలలో పవిత్రోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ మూడు రోజులు ఆలయంలోని సంపంగి ప్రాకారంలో ఉదయం స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు ఈ కార్యక్రమం ఉంటుంది. అలాగే మూడు రోజులు సాయంత్రం వేళ ప్రత్యేక అలంకరణతో శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి ఆలయ మాడవీధులలో విహరించి భక్తులకు దర్శనమిస్తారు. ఆగస్టు 23వ తేదీన పవిత్రాల ప్రతిష్ట కార్యక్రమం ఉంటుంది. ఆగస్ట్ 24న పవిత్ర సమర్పణ, 25న పూర్ణాహుతి కార్యక్రమాలను నిర్వహించనున్నారు. పవిత్రోత్సవాల నేపథ్యంలో టీటీడీ పలు ఆర్జిత సేవలు రద్దు చేసింది. పవిత్రోత్సవాలకు అంకురార్పణ చేసే ఆగస్ట్ 22వ తేదీ సహస్రదీపాలంకార సేవను రద్దు చేశారు. ఆగస్ట్ 23వ తేదీ నుంచి ఆగస్ట్ 25వ తేదీ వరకూ ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, కళ్యాణోత్సవం, సహస్రదీపాలం కార సేవను రద్దు చేశారు. ఆగస్ట్ 25వ తేదీన అష్టదళ పాదపద్మారాధన సేవను టీటీడీ రద్దు చేసింది. అలాగే పవిత్రోత్సవాలు ముగిసిన తర్వాతి రోజైన ఆగస్ట్ 26వ తేదీన కళ్యాణోత్సవ సేవలను రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ విషయాన్ని ఓ ప్రకటన ద్వారా తెలియజేసిన టీటీడీ.. భక్తులు ఈ విషయాన్ని గమనించుకోవాలని సూచించింది.

## మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి ‘ఈవార్తలు’ నైజం!

*అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి ‘ఈవార్తలు’. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.*

**- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్**

**సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.**

## డీఎస్సీపై సీబీఐ విచారణ జరగాల్సిందే: రోజా



పుత్తూరు: కూటమి ప్రభుత్వం చేపట్టిన మెగా డీఎస్సీలో భారీగా అక్రమాలు, అవకతవకలు జరిగాయని, ఈ కుంభకోణానికి బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని మాజీ మంత్రి, వైసీపీ నాయకురాలు ఆర్కే రోజా డిమాండ్ చేశారు. నిరుద్యోగులను నట్టేట ముంచిన డీఎస్సీ ప్రక్రియపై సీబీఐ చేత తటస్థ విచారణ జరిపించాలని కోరుతూ నగరి నియోజకవర్గం పుత్తూరు పట్టణంలో ఆమె ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహం వద్ద ఆమె మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇచ్చిన మొట్టమొదటి ఉద్యోగ నోటిఫికేషన్‌లోనే పేపర్ లీకేజీలు, అవినీతి అక్రమాలు రాజ్యమేలాయని రోజా తీవ్రస్థాయిలో ఆరోపించారు. ప్రశ్నాపత్రాన్ని తయారు చేసిన నవీన్ అనే వ్యక్తికే మొదటి ర్యాంక్ రావడమే పేపర్ లీక్ అయిందనడానికి సజీవ సాక్ష్యమని స్పష్టం చేశారు. పేపర్ లీకేజీ నిజం కాకపోతే మొదటి ర్యాంకర్ నవీన్‌కు ఉద్యోగం ఇవ్వకుండా, రెండో ర్యాంక్ నుంచి ఎందుకు నియామకాలు చేపట్టారో ప్రభుత్వం సమాధానం చెప్పాలని సవాల్ విసిరారు. మరోవైపు స్పోర్ట్స్ కోటా పేరుతో దొంగ జీవోలను తెచ్చి, పోస్టులను విచ్చలవిడిగా అమ్ముకుని రూ. కోట్లు దోచుకున్నారని మండిపడ్డారు. విద్యార్థులు, నిరుద్యోగుల భవిష్యత్తుతో ఆడుకోవడం ఆపి, వెంటనే పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో పాటు నిరుద్యోగ భృతిని విడుదల చేయాలని ఆర్కే రోజా డిమాండ్ చేశారు.

## ఏపీలో పలు జిల్లాలకు రెడ్ అలర్ట్

వైజాగ్, ఆగస్టు 11 (ఈవార్తలు): ఏపీలోని పలు జిల్లాలలో మరికొన్ని గంటలలో పిడుగులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. పలు జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. రాబోయే మూడు గంటలు పార్వతీపురం మన్యం, విజయనగరం, అనకాపల్లి జిల్లాలలో పిడుగులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. ఈ మేరకు మంగళవారం సాయంత్రం ఏడు గంటల సమయంలో విపత్తుల నిర్వహణ సంస్థ ఎక్స్ వేదికగా ప్రకటన విడుదల చేసింది. నర్సీపట్నం, ఎలమంచిలి, తాళ్లపాలెం పరిసర ప్రాంతాల్లో పిడుగులు పడే అవకాశం ఎక్కువగా ఉందని తెలిపింది. తీరం వెంబడి గంటకు 40 కిలోమీటర్ల నుంచి 50 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని, సురక్షిత ప్రాంతాలలో ఉండాలని ప్రజలను అప్రమత్తం చేసింది. మరోవైపు ఉపరితల ఆవర్తన ప్రభావంతో.. బుధవారం నాటికల్లా వాయువ్య బంగాళాఖాతం పరిసరాల్లో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. దీని ప్రభావంతో పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, పోలవరం జిల్లాలలో అక్కడక్కడా పిడుగులతో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నట్లు వెల్లడించింది. విజయనగరం, శ్రీకాకుళం, విశాఖపట్నం, అనకాపల్లి, అంబేద్కర్ కోనసీమ, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు, తిరుపతి జిల్లాలలో చెదురుమదురుగా తేలికపాటి వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది. ఉరుములు, ఈదురుగాలులు వీచే సమయంలో ప్రజలు చెట్ల కింద ఉండొద్దని, భారీ హోర్డింగ్స్ వద్ద గానీ నిలబడకూడదని సూచించింది.

# హక్కులతో పాటు బాధ్యతలూ తెలుసుకోవాలి

**వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత**

హనుమకొండ, ఆగస్టు 11 (పీఐబీ): రాజ్యాంగం కల్పించిన హక్కులతో పాటు పౌరులుగా తమ బాధ్యతలను కూడా ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత అన్నారు. హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సీబీసీ) వరంగల్ క్షేత్ర కార్యాలయం ఆధ్వర్యంలో 'హర్ ఘర్ తిరంగా'పై నిర్వహిస్తున్న రెండు రోజుల సమగ్ర సమాచార, అవగాహన కార్యక్రమం, ఛాయాచిత్ర ప్రదర్శనను మంగళవారం జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయితో కలిసి ఆమె ప్రారంభించారు. ఛాయాచిత్ర ప్రదర్శనలో జాతీయ పతాకం ప్రస్థానం, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలకు సంబంధించిన అంశాలను వరంగల్ క్షేత్ర ప్రచార అధికారి తరుణ్‌కుమార్ బోడా వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి కమిషనర్ శ్వేత మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం, రాజ్యాంగ విలువలను కాపాడటంలో యువత క్రియాశీలకంగా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. హక్కుల కోసం పోరాడటం ఒకవైపు మాత్రమేనని, అదే నాణేనికి మరోవైపు ఉన్న పౌర బాధ్యతలను కూడా ప్రతి ఒక్కరూ గుర్తించాలని సూచించారు. దేశాభివృద్ధి, భవిష్యత్తు సమాజ నిర్మాణం యువతపైనే ఆధారపడి ఉందని, తమ జీవితాలను ఏ విధంగా మలుచుకోవాలన్నది వారి చేతుల్లోనే ఉందన్నారు. కష్టపడి తమ జీవితాలను మెరుగుపరుచుకోవాలని విద్యార్థులకు సూచించారు. జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటం, సమరయోధుల త్యాగాలను భవిష్యత్ తరాలు ఎప్పటికీ గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. స్వతంత్ర భారతదేశంలో జన్మించడం, గొప్ప ప్రజాస్వామ్య వ్యవస్థను వారసత్వంగా పొందడం అదృష్టమన్నారు. రాజ్యాంగం మనకు ప్రాథమిక హక్కులతో పాటు ప్రాథమిక విధులను కూడా కల్పించిందని తెలిపారు. జాతీయ పతాకం ఒక్కరోజులో



రూపుదిద్దుకున్నది కాదని, దాని వెనుక ఎన్నో సంవత్సరాల కృషి, పోరాటం, త్యాగాలు ఉన్నాయని కలెక్టర్ పేర్కొన్నారు. మనకు లభించిన స్వేచ్ఛ, ప్రజాస్వామ్యాన్ని కాపాడటంతో పాటు భవిష్యత్ తరాలకు మరింత బలమైన ప్రజాస్వామ్యాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ జి. శ్రీనివాస్ మాట్లాడుతూ 'హర్ ఘర్ తిరంగా'పై నిర్వహించిన క్విజ్, వక్తృత్వ, వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారని తెలిపారు. దేశం పట్ల బాధ్యతను పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని అన్నారు. కార్యక్రమంలో కళాబృందాలు ప్రదర్శించిన 'హర్ ఘర్ తిరంగా' యక్షగానం విద్యార్థులను ఆకట్టుకుంది. క్విజ్, వక్తృత్వ, వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు కమిషనర్ శ్వేత, కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ రజనీలత, కార్యక్రమ ఇన్‌చార్జి సమత, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## 'పెన్నిధి' పద్య కావ్యం ఆవిష్కరణ

హైదరాబాద్, ఆగస్టు 11 (ఈవార్తలు): కోడీహళ్లి ఫణి ప్రసన్న కుమార్ రచించిన 'పెన్నిధి' పద్య కావ్యం ఆవిష్కరణ కార్యక్రమం హైదరాబాద్ ప్రగతినగర్‌లోని సుందరయ్య భవన్‌లో ఘనంగా జరిగింది. ప్రముఖ సినీ గేయకవి, స్వర్ణ నంది పురస్కార గ్రహీత సాదనాల వేంకటస్వామి నాయుడు కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ప్రముఖ సంస్కృతాంధ్ర పండితుడు, విశ్రాంత ఉపన్యాసకుడు డా. వింజమూరి విశ్వనాథమయ్య గ్రంథాన్ని ఆవిష్కరించారు. అణుఇంధన సంస్థ విశ్రాంత శాస్త్రవేత్త, యువభారతి సంస్థ అధ్యక్షుడు, ప్రముఖ కవి డా. ఆచార్య ఫణీంద్ర 'పెన్నిధి' కావ్యాన్ని పరిచయం చేశారు. ఈ కావ్యం ఉత్కంఠభరితమైన సస్పెన్స్‌తో కూడిన చలనచిత్రాన్ని తిలకించిన అనుభూతిని కలిగిస్తుందని ఆయన పేర్కొన్నారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న డా. రాధశ్రీ కావ్యాన్ని, కావ్యకర్తను ప్రశంసిస్తూ పద్యప్రసంగం చేశారు. సుందరయ్య భవన్ కార్యదర్శి మల్లయాచారి తదితరులు ప్రసంగించారు. అనంతరం గ్రంథకర్త ఫణి ప్రసన్న కుమార్ వేదికపై ఉన్న ప్రముఖులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ తన కావ్యంలోని కొన్ని పద్యాలను సభలో వినిపించారు. కార్యక్రమానికి ముందు నిర్వహించిన కవి సమ్మేళనంలో పలువురు కవులు తమ కవితాగానంతో సభికులను అలరించారు.

## నూతన పింఛన్ల దరఖాస్తుల స్వీకరణ

మల్యాల, ఆగస్టు 11 (ఈవార్తలు): మల్యాల మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో మంగళవారం నూతన పింఛన్ల దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. సర్పంచ్ బొట్ల జయ, ఈఓ శ్రీకాంత్, ఉపసర్పంచ్ వినయ్ ఆధ్వర్యంలో అర్హులైన లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. వికలాంగులు, కల్లుగీత కార్మికులు, చేనేత కార్మికులు, డయాలసిస్, ఫైలేరియా బాధితులు, ఒంటరి మహిళలు తదితర అర్హుల నుంచి పింఛన్ల కోసం దరఖాస్తులు తీసుకుంటున్నారు. అర్హత ఉన్న వారు అవసరమైన పత్రాలతో గ్రామపంచాయతీ కార్యాలయాన్ని సంప్రదించి దరఖాస్తులు సమర్పించాలని అధికారులు సూచించారు. నూతన పింఛన్లకు అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## బీఎడ్ కాలేజీ బ్రిడ్జి రోడ్డు బాగు చేయాలి

**వేములవాడ రూరల్ బీజేపీ అధ్యక్షుడు బూరుగుపల్లి పరమేష్ డిమాండ్**

వేములవాడ అర్బన్, ఆగస్టు 11 (ఈవార్తలు): వేములవాడ-మల్లారం మార్గంలోని బి.ఎడ్ కాలేజీ సమీప బ్రిడ్జి రోడ్డు అధ్వానంగా మారిందని, వెంటనే మరమ్మతులు చేపట్టి ప్రజల ఇబ్బందులను తొలగించాలని వేములవాడ రూరల్ బీజేపీ మండల అధ్యక్షుడు బూరుగుపల్లి పరమేష్ డిమాండ్ చేశారు. రోడ్డు దుస్థితి కారణంగా ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆయన అన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. గత మున్సిపల్ ఎన్నికల సమయంలో అభివృద్ధి చేస్తామని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చినా ఆరు నెలలు గడిచినా రోడ్డు నిర్మాణ పనులు పూర్తి కాలేదని విమర్శించారు. రూరల్ ప్రాంతాల నుంచి నియోజకవర్గ కేంద్రానికి వచ్చే ప్రజల సమస్యలను పట్టించుకోకుండా పాలకులు మాటలకే పరిమితమయ్యారని ఆరోపించారు. బి.ఎడ్ కాలేజీ బ్రిడ్జి రోడ్డు సమస్యపై ఇకనైనా ప్రభుత్వం దృష్టి సారించాలని పరమేష్ కోరారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం చేస్తే వేములవాడ రూరల్ బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని హెచ్చరించారు. అదేవిధంగా ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌పై ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకుని ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బాధ్యతాయుత పదవుల్లో ఉన్న ప్రజాప్రతినిధులు హుందాగా వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో రూరల్ మండల అధికార ప్రతినిధి సుంకరి నరేందర్, ప్రధాన కార్యదర్శి తోట శేఖర్, బూత్ అధ్యక్షులు సాగర్ల నరేష్, సారా నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థుల భవిష్యత్తుకు ప్రాధాన్యం

**కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్**

మెట్‌పల్లి, ఆగస్టు 11 (ఈవార్తలు): కోరుట్ల నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి విద్యార్థుల భవిష్యత్తుకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తామని కోరుట్ల ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్ అన్నారు. మంగళవారం మెట్‌పల్లి మండలం వేంపేట, మల్లాపూర్ మండలం మొగిలిపేట గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో విద్యాబోధన, తరగతి గదుల పరిస్థితి, తాగునీరు, పారిశుధ్యం తదితర మౌలిక వసతులను పరిశీలించారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి చదువుల పురోగతి, పాఠశాలలో అందుతున్న సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు. మొగిలిపేట పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి నాణ్యత, పరిశుభ్రతపై సిబ్బందికి సూచనలు చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పోషకాహారం అందించాలని, ఉపాధ్యాయులు బాధ్యతగా పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మరింత మెరుగైన వసతులు కల్పించేందుకు కృషి చేస్తామని, నియోజకవర్గంలోని పాఠశాలలను అభివృద్ధి చేసి విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తామని తెలిపారు.



## పెండింగ్ కేసులకు చెక్ పెట్టాలి: ఎస్పీ అశోక్

కోరుట్ల, ఆగస్టు 11 (ఈవార్తలు): పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి బాధితులకు సత్వర న్యాయం అందించాలని జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ పోలీసు అధికారులను ఆదేశించారు. మంగళవారం కోరుట్ల పోలీస్‌స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేసుల దర్యాప్తు పురోగతి, పెండింగ్ కేసులు, స్టేషన్ రికార్డులు, కేసు డైరీలు, రిజిస్టర్లను పరిశీలించారు. ప్రతి ఫిర్యాదుపై వేగంగా స్పందించి, బాధితుల సమస్యలను చట్టపరంగా పరిష్కరించాలని సూచించారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, విధుల్లో క్రమశిక్షణ, బాధ్యతతో పనిచేయాలని సిబ్బందికి సూచించారు. రౌడీషీటర్లు, పాత నేరస్తుల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని, నేరాల నియంత్రణకు బీట్ వ్యవస్థ, రాత్రి గస్తీని పటిష్ఠం చేయాలని ఆదేశించారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై కఠినంగా వ్యవహరించాలని తెలిపారు. సైబర్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, రోడ్డు భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. తనిఖీలో మెట్‌పల్లి డీఎస్పీ రాములు, ఎస్ఐలు శ్యామ్‌రాజ్, గంగాధర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



## ప్రధానిపై వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలి

**ఆది శ్రీనివాస్‌పై రాపల్లి శ్రీధర్ మండిపాటు**

**అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేత**

వేములవాడ అర్బన్, ఆగస్టు 11 (ఈవార్తలు): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌పై ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ చేసిన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకుని బహిరంగ క్షమాపణ చెప్పాలని వేములవాడ పట్టణ బీజేపీ అధ్యక్షుడు రాపల్లి శ్రీధర్ డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే వైఖరిని నిరసిస్తూ మంగళవారం పట్టణ బీజేపీ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలతో కలిసి అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రాపల్లి శ్రీధర్ మాట్లాడుతూ.. "మీ ప్రధాని" అంటూ ఎమ్మెల్యే మాట్లాడటం ఆయన బాధ్యతారాహిత్యానికి, నిలకడలేని రాజకీయాలకు నిదర్శనమని విమర్శించారు. దేశ ప్రధాని ఏ ఒక్క రాజకీయ పార్టీకి పరిమితం కాదని, ప్రపంచ దేశాలు గౌరవించే నాయకుడని అన్నారు. స్వార్థ రాజకీయాలు, మంత్రి పదవిపై ఆశతోనే ఆది శ్రీనివాస్ ప్రధానిపై విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యే రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా మాట్లాడుతున్నారని శ్రీధర్ అన్నారు. రానున్న అసెంబ్లీ సమావేశాల్లో బీజేపీ ఎమ్మెల్యేలందరూ స్పీకర్‌కు ఆది శ్రీనివాస్‌పై అధికారికంగా ఫిర్యాదు చేసేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఎమ్మెల్యే పదవికి ఆది శ్రీనివాస్ అనర్హుడని, ఆయనను పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. కరీంనగర్ ఎంపీగా, కేంద్ర మంత్రిగా బండి సంజయ్‌కుమార్ అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తున్నారని శ్రీధర్ పేర్కొన్నారు. వేములవాడ పట్టణంలోని రహదారులన్నీ గుంతలమయంగా మారి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. పట్టణాభివృద్ధికి ఎమ్మెల్యే ఎంతమేర నిధులు తీసుకొచ్చారో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆది శ్రీనివాస్ తన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని క్షమాపణ చెప్పకపోతే ఆయన రాజీనామా కోసం నియోజకవర్గంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని శ్రీధర్ హెచ్చరించారు. యువత, ప్రజాసంఘాలు, కాంగ్రెస్‌లోని అసంతృప్తి నాయకులను కలుపుకొని ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని తెలిపారు. బీజేపీ పట్టణ ఉపాధ్యక్షుడు కటకం శ్రీనివాస్ మాట్లాడుతూ.. బండి సంజయ్ ఎంపీగా తన పరిధిలోని ఏడు నియోజకవర్గాల అభివృద్ధికి రూ.20 వేల కోట్లకు పైగా కేంద్ర నిధులు తీసుకొచ్చారని తెలిపారు. నిధుల వివరాలు తెలుసుకోవాలంటే ఎమ్మెల్యే గూగుల్‌లో పరిశీలించుకోవాలని వ్యాఖ్యానించారు. ఆలయ అభివృద్ధి పేరుతో పురాతన రాతి కట్టడాలను తొలగించి సిమెంట్ నిర్మాణాలు చేపట్టడంపై కూడా ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. కౌన్సిలర్ కొండ్లేపు ముత్యం మాట్లాడుతూ.. ఎమ్మెల్యే ఏ దేశంలో ఉంటున్నారో, భారతదేశంలో లేరా అని ప్రశ్నించారు. ప్రస్తుతం వేములవాడలో జరుగుతున్న అభివృద్ధి పనులు దేవాదాయ శాఖ నిధులతోనే జరుగుతున్నాయని, పట్టణాభివృద్ధికి ఎమ్మెల్యే ప్రత్యేకంగా ఒక్క రూపాయి కూడా తీసుకురాలేదని విమర్శించారు. కార్యక్రమంలో గడ్డమీద శీను, బిల్లా కృష్ణ, వాసం మల్లేశం, నామాల శేఖర్, నేరెళ్ల సాయికిరణ్, లాల శేఖర్, నాంపల్లి లక్ష్మణ్, వావిలాల నరసయ్య, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

## పెళ్లైన ఆర్నెల్లకే తిరిగిరాని లోకాలకు!

**మాల్టాలో రోడ్డు ప్రమాదం.. జగిత్యాల యువకుడు మృతి**



జగిత్యాల టౌన్, ఆగస్టు 11 (ఈవార్తలు): ఉపాధి కోసం మాల్టాకు వెళ్లిన జగిత్యాల పట్టణానికి చెందిన 27 ఏళ్ల యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ ఘటనతో జగిత్యాలలోని ఇస్లాంపురా ప్రాంతంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఇస్లాంపురాకు చెందిన. మహమ్మద్ ముజహిద్, కుమారుడు మహమ్మద్ జవాద్ (27) మాల్టాలోని ఓ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. కారులో ప్రయాణిస్తుండగా ట్రక్కు ఢీకొనడంతో ప్రమాదం జరిగినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ ప్రమాదంలో జవాద్ అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం. ఘటనకు సంబంధించిన సమాచారాన్ని అధికారులు కుటుంబ సభ్యులకు తెలియజేశారు. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. జవాద్ సుమారు ఏడాదిన్నర క్రితం ఉద్యోగం కోసం మాల్టాకు వెళ్లాడు. ఆరు నెలల క్రితం స్వదేశానికి తిరిగి వచ్చి వివాహం చేసుకున్నాడు. అనంతరం తిరిగి మాల్టాకు వెళ్లాడు. వివాహమైన కేవలం ఆరు నెలలకే రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు.



## పేదలకు సీఎం సహాయనిధి అండ

**ఎమ్మెల్యే డా. సంజయ్‌కుమార్.. సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత**

జగిత్యాల, ఆగస్టు 11 (ఈవార్తలు): ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు సీఎం సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) అండగా నిలుస్తోందని జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్‌కుమార్ అన్నారు. జగిత్యాల పట్టణంలోని 33వ వార్డుకు చెందిన కుక్కల పెద్ద భీమయ్యకు సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన రూ.1 లక్ష విలువైన చెక్కును మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న పేదలకు సీఎం సహాయనిధి ద్వారా ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజలకు అవసరమైన సమయంలో సహాయం అందించేందుకు తనవంతు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పంబాల సుజాత రాము, నాయకులు శరత్‌రావు, శంకర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## మంచినీటి సమస్య పరిష్కారానికి చర్యలు

**ఓపెన్‌వెల్ మంజూరుపై ఎమ్మెల్యే సత్యంకు కృతజ్ఞతలు**

గంగాధర, ఆగస్టు 11 (ఈవార్తలు): గంగాధర మండలం ఇస్లాంపురం గ్రామానికి మంచినీటి సౌకర్యం కల్పించేందుకు మంచినీటి బావిని మంజూరు చేయించిన చొప్పదండి ఎమ్మెల్యే డా. మేడిపల్లి సత్యంను గ్రామ ప్రజలు మంగళవారం ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ సర్పంచ్ బారాజు ప్రభాకర్‌రెడ్డి, ఉప సర్పంచ్ సుంకె రవీందర్, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు ఎమ్మెల్యేను కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు తమ గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్న ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన చెక్కులను నేరెళ్ల సత్తయ్యకు, జిట్టబోయిన రాజలింగం కుమార్తెకు ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బారాజు ప్రభాకర్‌రెడ్డి, ఉప సర్పంచ్ సుంకె రవీందర్, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## పర్యావరణ పోటీల్లో కిడ్స్ కాన్వెంట్ విద్యార్థుల ప్రతిభ

**వివిధ విభాగాల్లో 60 మంది విద్యార్థులకు సర్టిఫికెట్లు**

వేములవాడ అర్బన్, ఆగస్టు 11 (ఈవార్తలు): కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన ఎన్ఎస్‌పీసీ--2026 నేషనల్ స్టూడెంట్ పర్యావరణ పోటీల్లో కిడ్స్ కాన్వెంట్ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఆన్‌లైన్‌లో నిర్వహించిన పరీక్షలో పాల్గొన్న విద్యార్థులు వివిధ విభాగాల్లో సర్టిఫికెట్లు సాధించారు. డైమండ్ విభాగంలో 35 మంది, గోల్డ్ విభాగంలో 16 మంది, సిల్వర్ విభాగంలో నలుగురు, బ్రౌన్ విభాగంలో ఐదుగురు విద్యార్థులు సర్టిఫికెట్లు పొందారు. మొత్తం 60 మంది విద్యార్థులు ఈ ఘనత సాధించారు. సర్టిఫికెట్లు సాధించిన విద్యార్థులకు పాఠశాల కరస్పాండెంట్ నరాల దేవేందర్, డైరెక్టర్ ఫణి, ప్రిన్సిపాల్ ధరక్షన్ వసు పియా బహుమతులు అందజేసి అభినందించారు. చదువుతో పాటు సమాజహితం, పర్యావరణ పరిరక్షణపై విద్యార్థుల్లో అవగాహన పెంచేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని ప్రిన్సిపాల్ తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఘనంగా 'యూబ్యూబ్' బోనాల జాతర

జగిత్యాల, ఆగస్టు 11 (ఈవార్తలు): జగిత్యాల పట్టణంలోని ఓల్డ్ బస్టాండ్ సర్కిల్‌లో తెలంగాణ జగిత్యాల జిల్లా యూట్యూబర్స్, కళాకారుల ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాల జాతరలో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ పాల్గొన్నారు. అమ్మవారికి బోనాలు ఎత్తుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం బోనాల ఊరేగింపులో భక్తులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జగిత్యాలలో తొలిసారిగా యూట్యూబర్స్, కళాకారుల ఆధ్వర్యంలో బోనాల జాతర నిర్వహించడం అభినందనీయమన్నారు. బోనాలు తెలంగాణ ప్రజలకు కేవలం పండుగ మాత్రమే కాదని, సంస్కృతి, సంప్రదాయాలు, ఆచారాలతో ముడిపడిన భావోద్వేగమని పేర్కొన్నారు. తెలంగాణ సంస్కృతి, జానపద కళలను భావితరాలకు అందించడంలో యూట్యూబర్స్, కళాకారులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు దయ్యాల చంద్రకళ శంకర్, మానపూరి పవిత్ర మహేష్, యూట్యూబర్స్, కళాకారులు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ఐఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్ లో 'గాంధీ' నం.1

పద్మారావు నగర్, ఆగస్టు 11 (ఈవార్తలు): ప్రతిష్ఠాత్మక 'ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్' -2026 ప్రకటించిన ప్రభుత్వ వైద్య కళాశాలల ర్యాంకింగ్స్‌లో సికింద్రాబాద్‌లోని గాంధీ మెడికల్ కాలేజ్ విశిష్ట స్థానాన్ని దక్కించుకుంది. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ప్రథమ స్థానంలో నిలిచి తన ప్రత్యేకతను చాటుకోగా, జాతీయ స్థాయిలో ప్రభుత్వ వైద్య కళాశాలల విభాగంలో 43వ ర్యాంకును, జోన్ పరిధిలో 9వ స్థానాన్ని సొంతం చేసుకుంది. గాంధీ మెడికల్ కాలేజీ సాధించిన ఈ ఘన విజయాన్ని పురస్కరించుకుని కళాశాల ప్రాంగణంలో ఆనందోత్సవాలు మిన్నంటాయి. ఈ సందర్భంగా అందరి సమక్షంలో కేక్ కట్ చేసి విజయోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సునీల్ కుమార్, వైస్ ప్రిన్సిపల్స్ డాక్టర్ ఎస్. చంద్రశేఖర్, డాక్టర్ రాజారాం, డాక్టర్ బి.వి. నాగ మోహన్, టీజీడీఏ గాంధీ యూనిట్ అధ్యక్షుడు డాక్టర్ అవుల మురళీధర్, జూడా అధ్యక్షుడు డాక్టర్ విక్రమ్‌లతో పాటు పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, వైద్యులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రిన్సిపాల్ డాక్టర్ కె. ఇందిరకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె. ఇందిర నాయకత్వంలో అధ్యాపకులు, వైద్యులు, విద్యార్థులు మరియు సిబ్బంది అందరూ కలిసి చేసిన సమిష్టి కృషి వల్లే ఈ జాతీయ స్థాయి గుర్తింపు సాధ్యమైందని ప్రతినిధులు పేర్కొన్నారు.



ఈవార్తలు
# వినోదవాణి CINEMA
బుధవారం 12-8-2026, జగిత్యాల | www.evarthalu.com


లవ్లీ చిత్రం






## రాహుల్ సిప్లిగంజ్‌పై కేసు

ప్రముఖ గాయకుడు, బిగ్‌బాస్ విజేత రాహుల్ సిప్లిగంజ్ మరోసారి వివాదంలో చిక్కుకున్నారు. 'నాటు నాటు' పాటతో అంతర్జాతీయ ఖ్యాతి పొందిన ఆయనపై విశాఖపట్నంలో కేసు నమోదైంది. ఓ యువతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాహుల్ సిప్లిగంజ్‌తో పాటు మరికొందరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. విశాఖకు చెందిన ఓ యువతి ఫిర్యాదు ప్రకారం.. కర్పూరపు రాహుల్ రెడ్డి అనే వ్యక్తి తనను పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడని ఆమె ఆరోపించారు. అంతేకాకుండా, వ్యక్తిగత ఫొటోలు, వీడియోలతో బ్లాక్‌మెయిల్ చేస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో సింగర్ రాహుల్ సిప్లిగంజ్ కూడా జోక్యం చేసుకున్నారని యువతి ఆరోపించారు. రాహుల్ రెడ్డికి బంధువునని చెప్పి, తనను బెదిరించారని, బలవంతంగా కొన్ని వీడియో స్టేట్‌మెంట్లు ఇప్పించారని ఆమె తన ఫిర్యాదులో వివరించారు. యువతి ఫిర్యాదుతో రాహుల్ సిప్లిగంజ్‌తో సహా మొత్తం 16 మందిపై పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలుస్తోంది. వీరిలో మధ్యవర్తిత్వం చేసిన కొందరు జర్నలిస్టులు, హైకోర్టు న్యాయవాది గీతా ప్రసన్న చందన కూడా ఉన్నట్లు సమాచారం. తొలుత ఎంవీపీ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు కాగా, తదుపరి విచారణ నిమిత్తం దీనిని ఎండాడ మహిళా పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. ప్రస్తుతం ఈ కేసు విచారణ దశలో ఉంది. యువతి చేసిన ఆరోపణలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఆరోపణలపై రాహుల్ సిప్లిగంజ్ నుంచి గానీ, ఆయన ప్రతినిధుల నుంచి గానీ ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.






## 'జై హనుమాన్'లో వామిక గబ్బి!

టాలీవుడ్ నుంచి రానున్న మోస్ట్ అవేటెడ్ పాన్ ఇండియా చిత్రాల్లో ప్రశాంత్ వర్మ తెరకెక్కిస్తున్న 'జై హనుమాన్' ఒకటి. బ్లాక్‌బస్టర్ 'హను-మాన్' చిత్రానికి సీక్వెల్‌గా వస్తున్న ఈ ప్రాజెక్ట్‌లో కన్నడ స్టార్ రిషబ్ శెట్టి హనుమంతుడిగా నటిస్తుండగా, యంగ్ హీరో తేజ సజ్జ కూడా కీలక పాత్రలో కనిపించనున్నారు. భారీ గ్యాప్ తర్వాత ఈ సినిమా ప్రస్తుతం శరవేగంగా జరుపుకుంటుంది. మైత్రి మూవీ మేకర్స్ అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ పౌరాణిక సూపర్‌హీరో చిత్రానికి ఎం.ఎం. కీరవాణి సంగీతం అందిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇదిలాఉంటే, ఈ సినిమాకి సంబంధించి ఫిల్మ్ నగర్ సర్కిల్స్‌లో ఓ క్రేజీ బజ్ వైరల్ అవుతోంది. ఇటీవలి కాలంలో వరుస విజయాలతో దూసుకుపోతున్న ట్రెండింగ్ బ్యూటీ వామికా గబ్బి 'జై హనుమాన్' చిత్రంలో కీలక పాత్రలో నటించనున్నట్లు తెలుస్తోంది. ఇటీవలే కోలీవుడ్ హిట్ చిత్రం 'డిసి' లో తన అద్భుతమైన నటనతో మంచి మార్కులు కొట్టేసిన వామికా.. ఇప్పుడు ఈ భారీ ప్రాజెక్ట్‌లో భాగం కానుందనే వార్త అభిమానులను ఎంతగానో ఉత్సాహపరుస్తోంది. విభిన్న నటనతో ప్రేక్షకులను అలరిస్తున్న వామికా గబ్బి ఈ చిత్రంలో ఒక పవర్‌ఫుల్ రోల్‌లో కనిపించనుందని సమాచారం. అయితే దీనిపై చిత్ర యూనిట్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

## టాక్సిక్.. 3:11 గంటల రన్‌టైం



రాకింగ్ స్టార్ యశ్ హీరోగా నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ పాన్ ఇండియా మూవీ 'టాక్సిక్'. గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. కేజీఎఫ్ సిరీస్ తర్వాత యశ్ నుండి వస్తున్న చిత్రం కావడంతో ప్రేక్షకుల్లో మరియు ట్రేడ్ వర్గాల్లో విపరీతమైన క్రేజ్ ఉంది. తాజాగా ఈ సినిమాకు సంబంధించి ఓ ఆసక్తికరమైన వార్త ఫిల్మ్ నగర్ సర్కిల్స్‌లో చక్కర్లు కొడుతోంది. ఈ చిత్రానికి 3 గంటల 11 నిమిషాల భారీ రన్‌టైమ్ ఉండబోతున్నట్లు సమాచారం. సినిమా కథాంశం, యాక్షన్ సీక్వెన్స్‌లు మరియు ఎమోషనల్ డ్రామాకు తగినట్లుగా నిడివి కాస్త ఎక్కువగా ఉండొచ్చని, దాదాపు మూడు గంటల పాటు సినిమాను నడిపించేలా దర్శకురాలు ప్లాన్ చేస్తున్నారనే చర్చ జరుగుతోంది. అయితే దీనిపై చిత్ర యూనిట్ నుంచి ఇంకా అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.



## ఆయనో నక్క.. నేను విశ్వాసమున్న కుక్కను

బాలీవుడ్ నటి, రాజకీయ నాయకురాలు కంగనా రనౌత్, ప్రముఖ నటుడు నసీరుద్దీన్ షాపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ దేశంలో తింటూ, పొరుగు దేశం కోసం పోరాడతారంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. విద్యార్థుల నిరసనలపై బాలీవుడ్ ప్రముఖుల మౌనం గురించి గతంలో నసీరుద్దీన్ షా చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ఈ వివాదం మరోసారి రాజుకుంది. ఇటీవల నటుడు పియూష్ మిశ్రా, నసీరుద్దీన్ షా వ్యాఖ్యలను ప్రస్తావించిన ఓ వార్తను కంగనా తన సోషల్ మీడియాలో పంచుకున్నారు. ఈ సందర్భంగా నసీరుద్దీన్‌ను ఉద్దేశిస్తూ.. "నిజం చెప్పాలంటే ప్రతి ఒక్కరూ ఎవరో ఒకరికి కుక్కలే. కానీ, నేను ఏ ఇంటి (దేశం) రొట్టె తింటున్నానో, ఆ ఇంటికి కాపలా కాస్తున్నందుకు, దాని కోసం పోరాడుతున్నందుకు గర్వపడుతున్నాను. నసీర్ సాబ్ ఈ దేశపు తిండి తింటారు. కానీ, పొరుగు దేశం కోసం పోరాడతారు" అని కంగనా రాసుకొచ్చారు. ఆయన్ను ఓ 'నక్క' (లోమ్డీ) అని అభివర్ణించిన కంగనా, తాను మాత్రం విశ్వాసపాత్రమైన కుక్కగా ఉండటానికే ఇష్టపడతానని స్పష్టం చేశారు. గతంలో విద్యార్థుల నిరసనలపై బాలీవుడ్ ప్రముఖులు ఎందుకు మౌనంగా ఉంటున్నారని ప్రశ్నించినప్పుడు నసీరుద్దీన్ షా వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. "నోట్లో ఎముక ఉన్న కుక్క మొరగదు. ఆ ఎముక కిందపడగానే లేదా పళ్లు విరగ్గొట్టగానే అప్పుడు మొరుగుతుంది" అంటూ ఆయన వ్యాఖ్యానించారు. ఇటీవల జార్ఖండ్‌లో విద్యార్థుల నిరసనలకు మద్దతుగా పియూష్ మిశ్రా మాట్లాడుతూ, షా వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ ఇప్పుడు ఏ 'కుక్కలు' మౌనంగా ఉన్నాయని ప్రశ్నించారు. ఈ వార్తను షేర్ చేస్తూనే కంగనా నసీరుద్దీన్‌పై విరుచుకుపడ్డారు. గతంలో కూడా కంగనా విద్యార్థుల ఉద్యమాలను విమర్శిస్తూ, యువతలో ఒక వర్గాన్ని 'గట్టర్ చాప్' అని సంబోధించి వివాదంలో చిక్కుకున్న విషయం తెలిసిందే.



## నా ఓటు పోయింది

బెంగళూరులో గల్లంతైన 65 లక్షల ఓట్లలో తన ఓటు కూడా ఉన్నదని నటుడు ప్రకాశ్ రాజ్ తెలిపారు. ఈ విషయంపై సోషల్ మీడియాలో ఓ సెల్ఫీ వీడియోను పంచుకున్నారు. ప్రత్యేక సమగ్ర సవరణపై ఆయన మాట్లాడారు. తాను పుట్టి పెరిగిన నియోజకవర్గంలో తన ఓటును తొలగించడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ తర్వాత బెంగళూరు నియోజకవర్గంలో తొలగించిన 65 లక్షల ఓట్లలో తనది కూడా ఉన్నదని, ఇది చాలా హాస్యాస్పదంగా అనిపిస్తోందని ప్రకాశ్ రాజ్ పేర్కొన్నారు. తాను బెంగళూరు నియోజకవర్గంలోనే పుట్టానని, ఇక్కడే నివసించానని, చదువంతా ఇక్కడే పూర్తయిందని, నటన నేర్చుకున్నది కూడా ఇక్కడేనని తెలిపారు. అన్నిటికంటే ముఖ్యంగా తాను ఈ నియోజకవర్గం నుంచి ఎంపీ అభ్యర్థిగా కూడా పోటీ చేశానని వెల్లడించారు. అయినా తన ఓటు తొలగించారని ఆశ్చర్యం వ్యక్తంచేశారు. మళ్లీ ఓటర్ కార్డు పొందడానికి ఏమేం డాక్యుమెంట్లు అడుగుతారో అంటూ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. తాను అన్నిటికీ సిద్ధంగా ఉన్నానని తెలిపారు.

## డ్రామాలొద్దు.. పని చూసుకో



తమిళనాడు రాజకీయాల్లో ప్రకంపనలు రేపిన ఉదయనిధి స్టాలిన్ వ్యాఖ్యల వివాదం నేపథ్యంలో నటి త్రిష ఇన్‌స్టాగ్రామ్‌లో చేసిన పోస్టులు వైరల్‌గా మారాయి. ఉదయనిధి వ్యాఖ్యలపై ఆమె నేరుగా స్పందించకపోయినా.. వరుస పోస్టులతో పరోక్షంగా ఆయనకు సమాధానం ఇచ్చారా? అనే చర్చ మొదలైంది. తన అమ్మమ్మ 98వ పుట్టినరోజు వేడుకలకు సంబంధించిన ఫొటోలను త్రిష ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్‌లో పంచుకుంది. వాటితో పాటు కొన్ని సందేశాలను కూడా షేర్ చేసింది. "ఈ వయసులోనూ డ్రామాలు చేయడం ఏంటి? నీ పని నువ్వు చూసుకో.. డబ్బు సంపాదించుకో.. ప్రశాంతంగా ఉండు" అంటూ ఉన్న పోస్ట్‌ను పంచుకుంది. దానికి కనుబొమ్మ పైకెత్తిన ఎమోజీని జత చేసింది. మరో సందేశంలో "మీరు చేసే ప్రతి పనీ తిరిగి మీ దగ్గరకే వస్తుంది. మంచిగా ఉండండి.. మంచే చేయండి" అని ఉంది. "ఇకపై మీకు అన్నీ సవ్యంగా జరిగే అధ్యాయం మొదలైంది" అనే మరో సందేశాన్ని కూడా ఆమె పంచుకుంది. "రిస్క్ తీసుకునేవారే గెలుస్తారు" వంటి సందేశాలు కూడా ఉన్నాయి.

## జూనియర్ ఎన్టీఆర్ కుడి భుజానికి సర్జరీ!

ప్రముఖ తెలుగు సినీ నటుడు జూనియర్ ఎన్టీఆర్‌కు బుధవారం భుజానికి శస్త్రచికిత్స జరగనుంది. గత నెలలో తగిలిన గాయంపై వైద్యుల పర్యవేక్షణ అనంతరం, హైదరాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రిలో ఈ శస్త్రచికిత్స నిర్వహించాలని నిర్ణయించినట్లు ఆయన బృందం ఒక ప్రకటనలో వెల్లడించింది. గత నెల జులై 27న ఓ కార్యక్రమంలో పాల్గొన్న సమయంలో ఎన్టీఆర్ భుజానికి గాయమైంది. ఆ సమయంలో డాక్టర్ జె. మధుసూదన్ రావు, డాక్టర్ ఆర్.ఎ. పురంచంద్ర తేజస్వి నేతృత్వంలోని వైద్య బృందం ఆయన్ను పరీక్షించి, గాయం నుంచి పూర్తిగా కోలుకోవడానికి ఆరు నుంచి ఎనిమిది వారాల పాటు విశ్రాంతి అవసరమని సూచించారు. అప్పట్లో అభిమానులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన ప్రతినిధులు ఒక ప్రకటనను విడుదల చేశారు. తాజాగా ఎన్టీఆర్ కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో, "వైద్యుల సూచన మేరకు ఎన్టీఆర్‌కు రేపు కిమ్స్ ఆసుపత్రిలో భుజానికి శస్త్రచికిత్స జరగనుంది. ఆయన త్వరగా కోలుకునేలా చూసేందుకు వైద్య బృందం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. శస్త్రచికిత్స అనంతరం ఆయన ఆరోగ్య పరిస్థితిని వెల్లడిస్తాం. మీ మద్దతుకు ధన్యవాదాలు" అని పేర్కొన్నారు. ఈ గాయం కారణంగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ఎన్టీఆర్ నటిస్తున్న 'డ్రాగన్' సినిమా షూటింగ్ తాత్కాలికంగా నిలిచిపోయింది. ఎన్టీఆర్ త్వరగా కోలుకోవాలని అభిమానులు, సినీ ప్రముఖులు ఆకాంక్షిస్తున్నారు.








# ఫుట్‌బాల్‌కు మెస్సీ బ్రేక్!

ఫిఫా వరల్డ్‌కప్‌లో మెరిసిన మెస్సీ లియోనల్ మెస్సీ తన తండ్రి జార్జ్ మెస్సీ మరణంతో విషాదంలో కూరుకుపోయాడు. తాను ప్రపంచం గర్వించదగ్గ ఫుట్‌బాలర్ అవ్వడానికి కారణమైన తండ్రి ఇక లేరనే వార్తను జీర్ణించుకోలేకపోతున్న మెస్సీ.. కొన్నిరోజులు ఆటకు విరామం ప్రకటించాడు. అయితే.. అతడు మళ్లీ పునరాగమనం ఎప్పుడు చేస్తాడు? అనేది తెలియాల్సి ఉంది. ఫిఫా వరల్డ్‌కప్ ఫైనల్లో ఓటమి నుంచి తేరుకోకముందే తండ్రి జార్జ్ మెస్సీ మరణంతో కుంగిపోయాడు లియోనల్ మెస్సీ. గుండెపోటుతో జార్జ్ 68 ఏళ్లకే కన్నుమూయడం సాకర్ దిగ్గజాన్ని దిగ్భ్రాంతికి గురి చేసింది. తండ్రి అంత్యక్రియల కోసం అర్జెంటీనా చేరుకున్న మెస్సీ.. తండ్రి జ్ఞాపకార్థం నిర్వహించే తదనంతర కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉంది. దాంతో, కొన్ని రోజులు ఆటపై దృష్టి పెట్టే పరిస్థితి లేకపోవడంతో మెస్సీ విరామం ప్రకటించాడు. కొన్ని రోజులు మెస్సీ మైదానంలో దిగడు అని స్పానిష్ వార్తపత్రిక మర్కా వెల్లడించింది. తండ్రి మరణవార్త తెలియగానే తమ సొంత పట్టణం రొసారియాకు ప్రైవేట్ విమానంలో వెళ్లాడు మెస్సీ. ఈ వారంలో జార్జ్ అంత్యక్రియలు నిర్వహించనున్నారు. దాంతో.. ఇంటర్ మియామి క్లబ్ యాజమాన్యం మెస్సీకి కావాల్సినన్ని రోజులు సెలవులు మంజూరు చేసింది. అతడు తిరిగి స్క్వాడ్‌లో చేరాలనుకునేంత వరకూ అర్జెంటీనాలోనే ఉండేందుకు అనుమతిచ్చింది ఇంటర్ మియామి.

## ప్రజ్ఞానంద తొలి గేమ్ డ్రా



సెయింట్ లూయిస్ (యూఎస్ఏ): గ్రాండ్ చెస్ టూర్‌లో భాగంగా అమెరికాలో జరుగుతున్న సింక్‌ఫీల్డ్ కప్‌లో భారత యువ గ్రాండ్‌మాస్టర్ ఆర్. ప్రజ్ఞానంద తొలి గేమ్‌ను డ్రా చేసుకున్నాడు. ఫస్ట్ రౌండ్‌లో నల్లపావులతో ఆడుతూ అమెరికా జీఎం సామ్ సేవియన్‌తో తలపడ్డ ప్రజ్ఞా.. 48 ఎత్తుల తర్వాత గేమ్‌ను డ్రాగా ముగించాడు. అమెరికా ఆటగాడు ఫాబియానో కరువానా.. జోర్డాన్ వాన్ (నెదర్లాండ్స్)ను ఓడించడం మినహా మిగిలిన ప్లేయర్లంతా తొలి గేమ్‌ను డ్రాతోనే సరిపెట్టుకున్నారు.

## సూపర్ శ్రేయాషి జోషి

సీనియర్ ఉమెన్స్ క్లాసిక్ లిషయ్ ఇన్‌లైన్ ఫ్రీస్టైల్ అంతర్జాతీయ టోర్నీ చైనాలో ఆగస్టు 9 నుంచి 12 వరకు నిర్వహించారు. ఈ టోర్నీలో భారత స్కేటింగ్ క్రీడాకారిణి శ్రేయాషి జోషి బ్రాంజ్ మెడల్‌ను గెలుచుకుంది. దీంతో ఈ టోర్నీలో పతకం సాధించిన తొలి భారత క్రీడాకారిణిగా రికార్డు సృష్టించింది. ఆసియన్ రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్స్‌లో గోల్డ్ మెడల్‌ను సాధించి రీజియన్‌లో పేరు తెచ్చుకున్న శ్రేయాషి అంతర్జాతీయంగా కూడా సత్తా చాటింది. మహారాష్ట్రలోని పుణెలో జన్మించిన శ్రేయాషి జోషి మూడేండ్ల వయసు నుంచే సోదరి స్వరాలితో కలిసి స్కేటింగ్ ఆడటం ప్రారంభించింది. ఆరేండ్ల వయసు వచ్చేసరికి జాతీయ క్రీడాకారిణి ఎదిగింది. 59వ నేషనల్ రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్స్‌లో స్పీడ్ స్లాలోమ్, క్లాసిక్ స్లాలోమ్ రెండు విభాగాల్లో గోల్డ్ మెడల్ సాధించింది. ఈ చాంపియన్‌షిప్స్ 2021లో మొహాలిలో నిర్వహించారు. అదేవిధంగా 2024, బెంగళూరులో నిర్వహించిన 62వ నేషనల్ చాంపియషిప్స్‌లో కూడా స్పీడ్, క్లాసిక్ స్లాలోమ్ రెండింట్లోనూ గోల్డ్ మెడల్ సాధించింది. దీంతో రెండు విభాగాల్లో గోల్డ్ మెడల్ సాధించిన భారతీయ స్కేటర్లలో జినేష్ నానల్‌తో పాటు శ్రేయాషి ఒకరు.

## అభిషేక్ పోరెల్ అరెస్ట్

ఐపీఎల్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ తరఫున ఆడుతున్న బెంగాల్ క్రికెటర్ అభిషేక్ పోరెల్ అరెస్ట్ అయ్యాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి లైంగిక దాడికి పాల్పడ్డాడని, బెదిరింపులకు గురిచేశాడని ఓ మెడికల్ విద్యార్థిని ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. కలకత్తా హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో పోలీసులు ఈ చర్యలు చేపట్టారు. హూగ్లీ రూరల్ ఎస్పీ కున్వర్ భూషణ్ సింగ్ తెలిపిన వివరాల ప్రకారం.. డమ్ డమ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇమామీ సిటీలో అభిషేక్‌ను అరెస్ట్ చేశారు. ఈ ఏడాది జూన్‌లో ఓ మెడికల్ విద్యార్థిని అభిషేక్‌పై పోలీసులకు ఫిర్యాదు చేసింది. గత మూడేళ్లుగా తాము రిలేషన్‌షిప్‌లో ఉన్నామని, గత ఏడాది నుంచి అభిషేక్ తనను దూరం పెడుతున్నాడని ఆమె తన ఫిర్యాదులో పేర్కొంది. పెళ్లి చేసుకుంటానని హామీ ఇచ్చి పలుమార్లు లైంగిక సంబంధం పెట్టుకున్నాడని, ఇప్పుడు పెళ్లికి నిరాకరిస్తున్నాడని బాధితురాలు ఆరోపించింది.




# రివర్స్ సింగ్‌పై ఫోకస్

శ్రీలంక పేసర్లను ఎదుర్కొనేలా గిల్ ప్లాన్



కొలంబోలో 6 రోజుల పాటు టీమిండియా ప్రాక్టీస్

శ్రీలంకతో రెండు టెస్టుల సిరీస్‌కు భారత్ మునుపెన్నడూ లేని రీతిలో సిద్ధమవుతోంది. ఈ నెల 4న కొలంబో చేరిన గిల్‌సేన.. నాన్‌డెస్క్రిప్ట్స్ క్రికెట్ క్లబ్ (ఎన్‌సీసీ) మైదానంలో వరుసగా ఆరు రోజులపాటు విరామం లేకుండా సాధన చేసింది. మూడు రోజుల వామప్ మ్యాచ్‌తో పాటు మిగిలిన రోజుల్లో రోజుకు ఐదు నుంచి ఆరు గంటలపాటు కఠోర నెట్ సెషన్లు నిర్వహించారు.

**లంకపై 18 ఏళ్లుగా కొనసాగుతున్న టెస్టు సిరీస్ ఓటమి లేని రికార్డును నిలబెట్టుకోవడంతో పాటు, ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్ రేసులో నిలవాలంటే ఈ సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేయాల్సిన అవసరం ఉండటంతో జట్టు యాజమాన్యం తీవ్రంగా సిద్ధమవుతోంది.**

## రోజుకు ఐదారు గంటల కఠోర నెట్ సెషన్లు.. పగుళ్ల పిచ్‌పై భారత స్పిన్నర్ల సాధన

ప్రస్తుత జట్టులో కేఎల్ రాహుల్, రవీంద్ర జడేజా, కుల్‌దీప్ యాదవ్‌కు మాత్రమే శ్రీలంకలో టెస్టులు ఆడిన అనుభవం ఉంది. మిగిలిన ఆటగాళ్లకు అక్కడి పరిస్థితులు కొత్త. దీంతో కొలంబో చేరిన 24 గంటల్లోనే సాధన ప్రారంభించిన జట్టు.. వేడి, తేమతో కూడిన వాతావరణానికి అలవాటు పడేలా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ ప్రాక్టీస్‌ను రెండు విడతలుగా నిర్వహించాడు. వామప్ మ్యాచ్ సందర్భంగా ఫీల్డింగ్ చేస్తున్న ఆటగాళ్లను మారుస్తూ, మరోవైపు నెట్స్‌లోనూ సాధన కొనసాగించారు. ఈ క్రమంలో ఫాస్ట్ బౌలర్లు పూర్తి వేగంతో బౌలింగ్ చేశారు. పంజాబ్ పేసర్ గుర్నూర్ బ్రార్ వేసిన బంతి కెప్టెన్ శుభ్‌మన్ గిల్ కుడిచేతి వేలికి బలంగా తాకింది. ముందు జాగ్రత్తగా రెండు రోజుల వామప్ మ్యాచ్‌కు దూరంగా ఉన్న గిల్ చివరి రోజు ఓపెనర్‌గా బరిలోకి దిగి మెరుపు ఇన్నింగ్స్‌తో తన ఫిట్‌నెస్‌ను చాటాడు.

### పగుళ్ల పిచ్‌పై స్పిన్ సాధన

వామప్ మ్యాచ్ అనంతరం విశ్రాంతి ఉంటుందని భావించినా ప్రధాన పేసర్లను మినహాయించి మిగతా ఆటగాళ్లు మళ్లీ మూడు గంటలకు పైగా సాధన చేశారు. టెస్టు నాలుగో రోజు పిచ్‌ను పోలిన విధంగా పగుళ్లతో కూడిన వికెట్‌ను ప్రత్యేకంగా సిద్ధం చేసి స్పిన్నర్లను ఎదుర్కొన్నారు. రవీంద్ర జడేజా, కుల్‌దీప్ యాదవ్, మానవ్ సుతార్, సారాంశ్ జైన్ బౌలింగ్‌లో బ్యాటర్లు డిఫెన్స్, ఫుట్‌వర్క్‌పై ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. సీనియర్ బ్యాటర్ కేఎల్ రాహుల్ స్పిన్నర్లను సమర్థంగా ఎదుర్కొనేందుకు స్వీప్, రివర్స్ స్వీప్ షాట్లను సాధన చేశాడు. గత పర్యటనల్లో పరిస్థితులకు త్వరగా అలవాటు పడకపోవడం వల్ల ఎదురైన ఇబ్బందులు పునరావృతం కాకుండా జట్టు ముందస్తు ప్రణాళికతో సాగుతోంది.

### రివర్స్ స్వింగ్‌పై గిల్ ఫోకస్

శ్రీలంక పిచ్‌లపై ఎదురయ్యే రివర్స్ స్వింగ్‌ను సమర్థంగా ఎదుర్కొనేందుకు గిల్ ప్రత్యేక సాధన చేశాడు. టీమ్ మేనేజ్‌మెంట్ తెప్పించిన కూకబురా రెడ్ బాల్స్‌లో సెమీ ఓల్డ్ బంతులతో ప్రాక్టీస్ చేశాడు. త్రో–డౌన్ స్పెషలిస్టులతో పాటు పేసర్ ఆకిబ్ నబీ బౌలింగ్‌లో రివర్స్ స్వింగ్ అవుతున్న బంతులను సుమారు 20 నిమిషాలపాటు ఎదుర్కొన్నాడు. శ్రీలంకలోని పొడి వాతావరణం, రఫ్ ఔట్‌ఫీల్డ్ కారణంగా బంతి త్వరగా మెరుపు కోల్పోయి రివర్స్ స్వింగ్‌కు అనుకూలించే అవకాశం ఉంది. ఈ సవాలును ముందుగానే అంచనా వేసిన గిల్.. పాత బంతులతో సాధన చేసి సన్నద్ధమయ్యాడు. ఆరు రోజుల కఠిన సాధన అనంతరం గిల్‌సేన తొలి టెస్టు కోసం మంగళవారం గాలెకు చేరుకుంది. బుధవారం విశ్రాంతి తీసుకుని గురువారం నుంచి మళ్లీ సాధన ప్రారంభించనుంది.



## రిటైర్మెంట్ తర్వాత ఏడ్చేశా: రహానే

భారత టెస్టు క్రికెట్ జట్టులో నమ్మకమైన బ్యాటర్‌గా, ముఖ్యంగా విదేశీ పర్యటనల్లో స్వింగ్ బౌలింగ్‌ను సమర్థంగా ఎదుర్కొన్న ఆటగాడిగా పేరుగాంచిన అజింక్యా రహానే ఇటీవల తన కెరీర్‌కు వీడ్కోలు పలికాడు. 38 ఏళ్ల వయసులో అన్ని ఫార్మాట్ల నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించిన వెంటనే, అతనికి వచ్చిన తొలి ఫోన్ కాల్ మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్ నుంచే కావడం విశేషం. రహానే ఇంకా ఆడతాడని భావించానని, ఇంత త్వరగా రిటైర్ కావడంపై సచిన్ కొంత నిరాశ వ్యక్తం చేసినట్లు రహానే స్వయంగా వెల్లడించాడు. రిటైర్మెంట్ ప్రకటించాక తాను ఎదుర్కొన్న భావోద్వేగాలను, సహచరుల స్పందనను రహానే ఒక ఇంటర్వ్యూలో పంచుకున్నాడు. "నేను రిటైర్మెంట్ వీడియో సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన వెంటనే సచిన్ పాజీ నుంచి ఫోన్ వచ్చింది. నువ్వు ఇంకా ఆడతావని అనుకున్నానని ఆయన అన్నారు. దానికి నేను ఎలాంటి పశ్చాత్తాపం లేకుండా తప్పుకుంటున్నానని, అందుకే కెరీర్‌ను ఇంకా సాగదీయాలని అనుకోవడం లేదని చెప్పాను. ఇర్ఫాన్ పఠాన్ కూడా ఫోన్ చేశాడు.

## గంగూలీ దంపతులకు హత్య బెదిరింపులు

భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్, బెంగాల్ క్రికెట్ అసోసియేషన్ (క్యాబ్) అధ్యక్షుడు సౌరవ్ గంగూలీకి తీవ్రమైన బెదిరింపులు ఎదురయ్యాయి. తనను, తన భార్య డోనా గంగూలీని చంపేస్తామంటూ గుర్తుతెలియని వ్యక్తులు హెచ్చరిక లేఖలు పంపారని, దీనిపై దాదా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఘటన క్రీడా వర్గాల్లో, కోల్‌కతాలో తీవ్ర కలకలం రేపింది. సీనియర్ పోలీస్ అధికారి వెల్లడించిన వివరాల ప్రకారం.. గత ఆరు నెలలుగా గంగూలీ పేరు మీద ఈ బెదిరింపు లేఖలు వస్తున్నాయి. అయితే, వాటిని తొలుత అంత సీరియస్‌గా తీసుకోలేదు. కానీ, నిన్న తన కార్యాలయానికి అందిన రెండు లేఖల్లో



"నిన్ను, నీ భార్యను చంపేస్తాం. నీకు సన్నిహితంగా ఉండేవారికి హాని తలపెడతాం" అని స్పష్టంగా ఉండటంతో గంగూలీ అప్రమత్తమయ్యాడు. వెంటనే తన మేనేజర్ ద్వారా కోల్‌కతాలోని ఠాకూర్‌పుకుర్ పోలీస్ స్టేషన్‌లో లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయించాడు. గంగూలీ ఫిర్యాదును తీవ్రంగా పరిగణిస్తున్నామని, వెంటనే దర్యాప్తు ప్రారంభించామని పోలీసులు తెలిపారు. ఈ లేఖల మూలాలను, వాటిని పంపిన వారిని గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నామని వెల్లడించారు. లేఖల కంటెంట్‌తో పాటు వాటిని పంపిన విధానంపై కూడా ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు ఓ అధికారి వివరించారు. ఈ లేఖలన్నీ ఒకే వ్యక్తి పంపాడా? లేక దీని వెనుక ఇంకెవరైనా ఉన్నారా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. ప్రాథమిక విచారణలో కీలక సమాచారం లభించినట్లు తెలుస్తోంది. ఉత్తర 24 పరగణాల జిల్లాలోని బెల్ఘరియా ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి కొరియర్ సర్వీస్ ద్వారా ఈ లేఖలను పంపి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. నిందితుడు వాడినట్లుగా భావిస్తున్న సిమ్ కార్డు కదలికలను పోలీసులు పరిశీలిస్తున్నారు. ఇప్పటికే సంబంధిత కొరియర్ ఏజెన్సీని సంప్రదించి, లేఖల పంపిణీకి సంబంధించిన వివరాలు సేకరిస్తున్నారు. కొరియర్ సిబ్బంది నుంచి ఒక మొబైల్ నంబర్‌ను గుర్తించామని, దాన్ని ట్రేస్ చేసే పనిలో ఉన్నామని పోలీసులు పేర్కొన్నారు.



## 2027 ప్రపంచకప్‌కు ఆఫ్ఘనిస్థాన్ అర్హత

**రషీద్ ఖాన్ ఆల్‌రౌండ్ షో**

ఆఫ్ఘనిస్థాన్ క్రికెట్ జట్టు 2027 వన్డే ప్రపంచకప్‌కు అర్హత సాధించింది. ఐర్లాండ్‌తో జరిగిన ఉత్కంఠభరితమైన రెండో వన్డేలో 3 వికెట్ల తేడాతో విజయం సాధించి ఈ ఘనతను అందుకుంది. కెప్టెన్ రషీద్ ఖాన్ బంతితో, బ్యాట్‌తో అద్భుతంగా రాణించి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఈ విజయంతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో ఆఫ్ఘనిస్థాన్ 2–0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. దక్షిణాఫ్రికా దేశాల్లో జరిగే ప్రపంచకప్ టోర్నమెంట్‌లో వరుసగా నాలుగోసారి తమ స్థానాన్ని ఖాయం చేసుకుంది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ఐర్లాండ్ 47 ఓవర్లలో 206 పరుగులకు ఆలౌటైంది. ఒక దశలో 128 పరుగులకే 8 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. అయితే, తొమ్మిదో వికెట్‌కు గేవిన్ హోయ్ (36), జై మూంద్రా (31) రికార్డు స్థాయిలో 76 పరుగులు జోడించి జట్టుకు గౌరవప్రదమైన స్కోరు అందించారు.

ఈవార్తలు
ప్రజావాణి
బుధవారం 12-8-2026, జగిత్యాల
www.evarthalu.com
నేటి ఈవార్తలు


నేటి ఈవార్తలు | సంపాదకీయం | Editorial

# యువతా.. నీ శక్తి ఇంతేనా?

భారత్‌కు అపారమైన యువశక్తి ఉంది. ప్రపంచంలోని అనేక దేశాలు వృద్ధాప్య జనాభా సమస్యను ఎదుర్కొంటున్న సమయంలో మన దేశానికి పెద్ద సంఖ్యలో పనిచేసే వయసు జనాభా ఉండటం ఒక గొప్ప అవకాశం. ఇది జనాభా లాభం. కానీ యువత సంఖ్య ఎక్కువగా ఉండటం మాత్రమే దేశానికి ఆర్థిక ప్రయోజనాన్ని ఇవ్వదు. వారికి సరైన విద్య, నైపుణ్యాలు, ఉపాధి, ఆరోగ్యం, భద్రత, ఆవిష్కరణలకు అవకాశాలు లభించినప్పుడే ఈ జనాభా బలం ఆర్థిక శక్తిగా మారుతుంది. లేకపోతే అదే యువ జనాభా నిరుద్యోగం, అసంతృప్తి, సామాజిక ఒత్తిడికి కారణమయ్యే ప్రమాదం ఉంది. నేటి యువత గత తరాలతో పోలిస్తే పూర్తిగా భిన్నమైన ప్రపంచంలో పెరుగుతోంది. ఒకప్పుడు సమాచారాన్ని పొందాలంటే పుస్తకాలు, గ్రంథాలయాలు, ఉపాధ్యాయులు ఆధారం. ఇప్పుడు స్మార్ట్‌ఫోన్ తెరిస్తే ప్రపంచ జ్ఞానం క్షణాల్లో అందుబాటులోకి వస్తోంది. కృత్రిమ మేధ, డిజిటల్ విద్య, ఆన్‌లైన్ కోర్సులు, ప్రపంచవ్యాప్త ఉద్యోగ అవకాశాలు యువతకు కొత్త ద్వారాలు తెరిచాయి. చిన్న పట్టణంలో ఉన్న యువకుడు కూడా ప్రపంచ స్థాయి నైపుణ్యాన్ని నేర్చుకునే అవకాశం పొందుతున్నాడు. గ్రామీణ ప్రాంతానికి చెందిన యువతి కూడా డిజిటల్ వేదికల ద్వారా వ్యాపారం ప్రారంభించగలుగుతోంది. ఇది గతంలో ఊహించని మార్పు. అయితే అవకాశాలు పెరిగినంతగా సవాళ్లు కూడా పెరిగాయి. డిగ్రీలు పెరుగుతున్నాయి.. కానీ ఉద్యోగానికి అవసరమైన నైపుణ్యాలు పెరుగుతున్నాయా? అన్న ప్రశ్న తీవ్రంగా ఆలోచించాల్సిన అంశం. ఏటా లక్షలాది మంది ఇంజనీరింగ్, డిగ్రీ, పీజీ విద్యను పూర్తి చేస్తున్నారు. కానీ పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు, విద్యార్థులకు ఉన్న నైపుణ్యాల మధ్య అంతరం ఇప్పటికీ కనిపిస్తోంది. ఫలితంగా ఒకవైపు సంస్థలు నైపుణ్యం ఉన్న ఉద్యోగుల కోసం వెతుకుతుంటే.. మరోవైపు చదువుకున్న యువత ఉద్యోగాల కోసం ఎదురుచూస్తోంది. ఇది కేవలం యువత సమస్య కాదు. ఇది విద్యా వ్యవస్థ, పరిశ్రమలు, ప్రభుత్వాలు కలిసి పరిష్కరించాల్సిన సమస్య. పాఠ్యాంశాలు మారుతున్న ప్రపంచానికి అనుగుణంగా మారాలి. తరగతి గదిలో నేర్చుకున్న సిద్ధాంతానికి, పరిశ్రమలో అవసరమైన ఆచరణాత్మక నైపుణ్యానికి మధ్య ఉన్న దూరం తగ్గాలి. కళాశాలలు కేవలం డిగ్రీలు ఇచ్చే కేంద్రాలుగా కాకుండా నైపుణ్యాలను పెంపొందించే వేదికలుగా మారాలి. పరిశ్రమలు కూడా విద్యాసంస్థలతో కలిసి పాఠ్యాంశాల రూపకల్పనలో భాగస్వాములు కావాలి. యువత సమస్యను కేవలం ఉద్యోగాల సంఖ్యతో కొలవడం కూడా సరిపోదు. ఎలాంటి ఉద్యోగాలు? ఎంతటి వేతనం? ఎంతటి భద్రత? ఎదుగుదలకు ఎంత అవకాశం? అన్న ప్రశ్నలు కూడా ముఖ్యం. యువత తమ జీవితాన్ని నిర్మించుకునే స్థిరమైన ఆదాయం పొందాలి. కాంట్రాక్టు, తాత్కాలిక, అస్థిర ఉపాధిపై మాత్రమే ఆధారపడే పరిస్థితి తగ్గాలి. ఉద్యోగం అంటే నెలాఖరున జీతం రావడం మాత్రమే కాదు.. భవిష్యత్తుపై భరోసా కలిగించే జీవనాధారం. మరోవైపు స్వయం ఉపాధి, స్టార్టప్‌లు, చిన్న పరిశ్రమలు, గ్రామీణ వ్యాపారాలకు యువతను ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. ప్రతి యువకుడికి ప్రభుత్వ ఉద్యోగం రావడం సాధ్యం కాదు. కానీ ప్రతి యువకుడికి తన ప్రతిభను ఉపయోగించుకునే అవకాశం ఉండాలి. ఒక యువకుడు పది మందికి ఉద్యోగం కల్పించే స్థాయికి ఎదిగితే అది అతని వ్యక్తిగత విజయం మాత్రమే కాదు.. దేశ ఆర్థిక వ్యవస్థకు కూడా బలం.



# పుస్తకం..స్మార్ట్ పలక


## (నేడు జాతీయ గ్రంథాలయ దినోత్సవం)

**ఒకప్పుడు గ్రంథాలయం అంటే పొడవైన అల్మారాలు.. వాటిలో వరుసగా పేర్చిన పుస్తకాలు.. నిశ్శబ్దంగా చదువుకుంటున్న విద్యార్థులు.. పేజీలు తిప్పే చప్పుడు.. పుస్తకాల వాసన. గ్రంథాలయంలోకి అడుగుపెడితేనే ఒక ప్రత్యేకమైన ప్రశాంతత కనిపించేది.**

**పుస్తకం కోసం గంటల తరబడి వెతకడం, కావాల్సిన సమాచారాన్ని కనుగొనేందుకు పేజీలు తిరగేయడం ఒక అనుభవంగా ఉండేది. కాలం మారింది. చదివే పద్ధతి మారింది. పుస్తకం రూపం మారింది. కానీ జ్ఞానం కోసం మనిషి చేసే అన్వేషణ మాత్రం మారలేదు. ఈ మార్పుకు ప్రతీకలుగా నేడు స్మార్ట్ లైబ్రరీలు ముందుకొస్తున్నాయి. పుస్తకాలతో పాటు ఈ-పుస్తకాలు, ఆడియో పుస్తకాలు, డిజిటల్ పత్రికలు, ఆన్‌లైన్ సమాచార వనరులు, డిజిటల్ భాండాగారాలు, కృత్రిమ మేధ ఆధారిత శోధన వ్యవస్థలు అందుబాటులోకి వచ్చాయి.**

ఒకప్పుడు గ్రంథాలయానికి వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు గ్రంథాలయమే మన చేతిలోకి వచ్చింది. జాతీయ గ్రంథాలయ దినోత్సవం సందర్భంగా మనం గుర్తుంచుకోవాల్సిన ముఖ్యమైన విషయం ఇదే. గ్రంథాలయం అంటే కేవలం పుస్తకాలు నిల్వ చేసే గది కాదు. ఒక సమాజం తన జ్ఞానాన్ని భద్రపరుచుకునే ప్రదేశం. తరతరాల అనుభవాలను తదుపరి తరానికి అందించే వారధి. భారతదేశంలో గ్రంథాలయ ఉద్యమానికి విశేష సేవలు అందించిన ఎస్.ఆర్. రంగనాథన్ వంటి మహనీయులు గ్రంథాలయాలను ప్రజల విద్యాభివృద్ధికి కీలక సాధనాలుగా తీర్చిదిద్దారు. నేడు ఆయన ఆలోచనలను డిజిటల్ యుగానికి అనుగుణంగా ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉంది.


సాంకేతిక పరిజ్ఞానం పుస్తకానికి కొత్త రూపాన్ని ఇచ్చింది. ఈ-పుస్తకం ద్వారా వేల పుస్తకాలను ఒకే పరికరంలో భద్రపరచుకోవచ్చు. ఆడియో పుస్తకాలతో ప్రయాణిస్తూ కూడా పుస్తకాలను వినవచ్చు. డిజిటల్ గ్రంథాలయాల ద్వారా ప్రపంచంలోని అనేక విశ్వవిద్యాలయాల పరిశోధనా పత్రాలు, పాత పుస్తకాలు, చారిత్రక పత్రాలు అందుబాటులోకి వచ్చాయి. ఒకప్పుడు అరుదైన పుస్తకం కోసం నగరం మొత్తం వెతకాల్సి వచ్చేది. ఇప్పుడు కొన్ని క్షణాల్లో దాని డిజిటల్ ప్రతిని కనుగొనే అవకాశం ఉంది. ఒక పరిశోధకుడు వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రంథాలయ సమాచారాన్ని తన కంప్యూటర్ నుంచే పొందగలుగుతున్నాడు. గ్రంథాలయం గోడల మధ్య నుంచి ప్రపంచవ్యాప్తంగా విస్తరించింది. కృత్రిమ మేధ రాకతో డిజిటల్ గ్రంథాలయాల స్వరూపం మరింత మారుతోంది. ఒక అంశంపై సమాచారం కావాలంటే పుస్తకాల జాబితాను వెతకడమే కాకుండా, సంబంధిత పుస్తకాలు, పరిశోధనా పత్రాలు, పాత పత్రికలు, గణాంకాలను సులభంగా గుర్తించే అవకాశాలు పెరుగుతున్నాయి. అయితే ఇక్కడ ఒక జాగ్రత్త అవసరం. కృత్రిమ మేధ ఇచ్చిన సమాచారం అంతా నిజమని నమ్మడం ఎంత ప్రమాదకరమో, సామాజిక మాధ్యమాల్లో వచ్చిన సమాచారాన్ని ధ్రువీకరించకుండా నమ్మడం కూడా అంతే ప్రమాదకరం. సాంకేతికత సమాచారాన్ని అందిస్తుంది. కానీ ఆ సమాచారాన్ని పరిశీలించి, విశ్లేషించి, సరైనదేదో నిర్ణయించే బాధ్యత మనిషిదే. డిజిటల్ యుగంలో మరో ఆందోళన ఉంది. పిల్లలు, యువత చిన్న వీడియోలకు అలవాటు పడుతున్నారు. కొన్ని సెకన్లలో సమాచారం కావాలనుకుంటున్నారు. దీర్ఘంగా చదివే ఓపిక తగ్గుతోంది. ఇది భవిష్యత్తుకు ప్రమాదకరం. ఒక చిన్న వీడియో ఒక విషయాన్ని పరిచయం చేయగలదు. ఒక సామాజిక మాధ్యమ పోస్టు ఒక అంశంపై ఆసక్తి కలిగించగలదు. కానీ లోతైన అవగాహనకు చదువు అవసరం. పుస్తకం మనకు సమాచారాన్ని మాత్రమే ఇవ్వదు. ఆలోచించడం నేర్పుతుంది. ప్రశ్నించడం నేర్పుతుంది. సహనం నేర్పుతుంది. ఒక అంశాన్ని వివిధ కోణాల్లో చూడగల సామర్థ్యాన్ని పెంచుతుంది.



- రామస్వామి చింత

అందుకే స్మార్ట్ లైబ్రరీలు వచ్చినంత మాత్రాన పుస్తక పఠన సంస్కృతి బలహీనపడకూడదు. సాంకేతికత పుస్తకానికి ప్రత్యామ్నాయం కాకుండా, పుస్తకాన్ని మరింత మందికి చేరువ చేసే సాధనంగా మారాలి. పుస్తకం కాగితంపై ఉన్నా.. తెరపై ఉన్నా.. దాని విలువ పాఠకుడి ఆలోచనను ఎంతగా ప్రభావితం చేస్తుందన్నదానిపైనే ఆధారపడి ఉంటుంది. స్మార్ట్ లైబ్రరీల అసలు ప్రయోజనం నగరాల్లోనే పరిమితం కాకూడదు. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులకు నాణ్యమైన పుస్తకాలు, పోటీ పరీక్షల సామగ్రి, పరిశోధనా సమాచారం, ఆన్‌లైన్ విద్యా వనరులు అందుబాటులోకి వస్తే అది సామాజిక మార్పుకు దారి తీస్తుంది. ఒక చిన్న గ్రామంలోని విద్యార్థికి హైదరాబాద్‌లోని విద్యార్థితో సమానమైన సమాచారాన్ని అందించగలిగితే డిజిటల్ అంతరం కొంతవరకు తగ్గుతుంది. ప్రతి మండల కేంద్రంలో ఆధునిక గ్రంథాలయం, ప్రతి గ్రామానికి డిజిటల్ ప్రాప్యత, విద్యార్థులకు అందుబాటులో ఉండే ఇంటర్నెట్, స్థానిక భాషల్లో డిజిటల్ పుస్తకాలు.. ఇవి భవిష్యత్ గ్రంథాలయ విధానంలో భాగం కావాలి. తెలుగు సాహిత్యానికి శతాబ్దాల చరిత్ర ఉంది. వేలాది పుస్తకాలు, పాత పత్రికలు, అరుదైన రచనలు, చారిత్రక పత్రాలు ఇంకా వివిధ గ్రంథాలయాలు, వ్యక్తిగత సేకరణల్లో ఉన్నాయి. వాటిని డిజిటలైజ్ చేసి భద్రపరచడం అత్యవసరం. ఒక పుస్తకం కాగితంపై పాడైపోవచ్చు. డిజిటల్ రూపంలో భద్రపరిస్తే తరతరాలకు అందించవచ్చు. తెలుగు భాషలో నాణ్యమైన ఈ-పుస్తకాలు, ఆడియో పుస్తకాలు, డిజిటల్ నిఘంటువులు, పరిశోధనా సమాచార భాండాగారాలు పెరగాలి. స్థానిక భాషల్లో జ్ఞానం అందుబాటులోకి రాకపోతే డిజిటల్ విప్లవం పూర్తిస్థాయిలో విజయవంతం కాలేదు.


నేటి గ్రంథాలయం కేవలం చదివే ప్రదేశంగా ఉండకూడదు. అది చర్చించే ప్రదేశం కావాలి. నేర్చుకునే ప్రదేశం కావాలి. పరిశోధించే ప్రదేశం కావాలి. సృజనాత్మకతకు వేదిక కావాలి. పిల్లల కోసం కథా పఠన కార్యక్రమాలు, యువత కోసం ఉద్యోగ మార్గదర్శక శిబిరాలు, పోటీ పరీక్షలకు అధ్యయన వేదికలు, రచయితలతో ముఖాముఖి కార్యక్రమాలు, డిజిటల్ నైపుణ్య శిక్షణ, పరిశోధకులకు సమాచార ప్రాప్యత వంటి కార్యక్రమాలతో గ్రంథాలయాలు మళ్లీ ప్రజల జీవితాల్లో కేంద్రంగా మారాలి. గ్రంథాలయం నిశ్శబ్దంగా ఉండొచ్చు.. కానీ అది నిశ్చలంగా ఉండకూడదు. కాలం మారుతుంది. పుస్తకం రూపం మారుతుంది. చదివే పరికరం మారుతుంది. సమాచారాన్ని పొందే పద్ధతి మారుతుంది. రేపు కృత్రిమ మేధ మరింత ముందుకు వెళ్లవచ్చు. కానీ జ్ఞానం కోసం మనిషి చేసే అన్వేషణకు ముగింపు ఉండదు. కాబట్టి మనం పుస్తకాన్ని కాపాడుకోవడమే కాదు.. పఠన సంస్కృతిని కాపాడుకోవాలి. గ్రంథాలయ భవనాలను నిర్మించడమే కాదు.. జ్ఞాన సమాజాన్ని నిర్మించాలి. స్మార్ట్ లైబ్రరీలు రావడం కాలానుగుణ మార్పు. వాటిని స్మార్ట్‌గా ఉపయోగించే పాఠకులను తయారు చేయడం మాత్రం మన సమాజం బాధ్యత.



# స్వరం మారుతోంది

**రాజకీయాల్లో శాశ్వత మిత్రులు ఉండరు.. శాశ్వత శత్రువులు ఉండరు అంటారు. కానీ అంతకంటే ఆసక్తికరమైన విషయం మరోటి ఉంది. అధికారంలో ఉన్నప్పుడు ఒక స్వరం.. అధికారానికి దూరమైనప్పుడు మరో స్వరం.. రాజకీయ గాలి మారుతుందనే సంకేతాలు కనిపించినప్పుడు ఇంకో స్వరం! తెలంగాణ రాజకీయాల్లో ఇప్పుడు వినిపిస్తున్న కొన్ని స్వరాలు ఈ సామెతను మరోసారి గుర్తుచేస్తున్నాయి.**

**మొన్నటివరకు బీఆర్ఎస్‌పై తీవ్ర విమర్శలు చేసిన దానం నాగేందర్, పోచారం శ్రీనివాస్ రెడ్డి వంటి నాయకులు ఇప్పుడు కేసీఆర్ నాయకత్వాన్ని ప్రశంసిస్తూ మాట్లాడటం రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీస్తోంది.**



ఒకప్పుడు విమర్శించిన నాయకుడినే ఇప్పుడు 'తోపు' అంటూ పొగడటం.. ఒకప్పుడు వ్యతిరేకించిన పార్టీ రాజకీయ ప్రాధాన్యాన్ని మళ్లీ గుర్తించడం.. ఇది సాధారణ రాజకీయ వ్యాఖ్యలా? లేక మారుతున్న రాజకీయ వాతావరణాన్ని ముందుగానే పసిగట్టిన నాయకుల వ్యూహాత్మక స్వరమా? ఈ ప్రశ్నకు సమాధానం కాలమే చెప్పాలి. కానీ ఈ పరిణామం మాత్రం ఒక విషయాన్ని స్పష్టం చేస్తోంది.. తెలంగాణ రాజకీయాల్లో రాజకీయ లెక్కలు మళ్లీ మారుతున్నాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి కొంతకాలం గడిచింది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు, వాటి అమలు, ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు, ప్రజలకు చేరుతున్న సంక్షేమం, ఉద్యోగాలు, రైతుల సమస్యలు, నగర--గ్రామీణ ప్రాంతాల పరిస్థితి వంటి అంశాలపై ప్రజల్లో చర్చ కొనసాగుతోంది. ప్రభుత్వంపై సంతృప్తి ఉన్న వర్గాలు ఉన్నట్లే, అసంతృప్తి వ్యక్తం చేస్తున్న వర్గాలు కూడా ఉన్నాయి. ఏ ప్రభుత్వానికైనా ఇది సహజమే. కానీ ఎన్నికలు దగ్గరపడే కొద్దీ ఆ అసంతృప్తి రాజకీయంగా ఎలా మారుతుందన్నదే అసలు ప్రశ్న. ఇక్కడే నాయకుల స్వరాలకు ప్రాధాన్యం పెరుగుతుంది.

రాజకీయ నాయకులు ప్రజల నాడిని చదవడంలో నైపుణ్యం కలిగినవారు. వారు కేవలం సభల్లో మాట్లాడరు. నియోజకవర్గాల్లో తిరుగుతారు. కార్యకర్తలతో మాట్లాడతారు. స్థానిక పరిస్థితులను గమనిస్తారు. ప్రజలలో ఎలాంటి చర్చ నడుస్తోందో తెలుసుకుంటారు. అందుకే ఒక నాయకుడి మాటల్లో వచ్చిన చిన్న మార్పు కూడా రాజకీయ పరిశీలకులకు సంకేతంగా కనిపిస్తుంది. అయితే ఆ సంకేతాన్ని వెంటనే ఎన్నికల ఫలితంగా మార్చడం మాత్రం తొందరపాటు. దానం నాగేందర్, పోచారం శ్రీనివాస్ రెడ్డి వంటి నాయకుల రాజకీయ ప్రయాణం, పార్టీ మార్పులు, గత వ్యాఖ్యలు, ప్రస్తుత వ్యాఖ్యలను ప్రజలు కూడా గమనిస్తున్నారు. నిన్నటి మాటకు, నేటి మాటకు మధ్య ఉన్న తేడాను ప్రజలు ప్రశ్నించే స్థాయికి వచ్చారు. నాయకుడు ఏ పార్టీలో ఉన్నాడన్నదానికంటే, ఏ సమయంలో ఏం మాట్లాడుతున్నాడన్నది కూడా ప్రజా చర్చలో భాగమవుతోంది. అయితే రాజకీయ నాయకుల స్వరం మారడం వెనుక కేవలం వ్యక్తిగత రాజకీయ ప్రయోజనాలే ఉన్నాయని చెప్పడం కూడా సరికాదు. రాజకీయ పరిస్థితులు మారుతాయి. పార్టీల బలాబలాలు మారుతాయి. నాయకులు తమ రాజకీయ భవిష్యత్తును పునఃసమీక్షించుకుంటారు. ప్రజల అభిప్రాయాలు మారుతాయి. ఒకప్పుడు ఓడిపోయిన పార్టీ మళ్లీ బలపడవచ్చు. అధికారంలో ఉన్న పార్టీపై అసంతృప్తి పెరగవచ్చు. అదే ప్రజాస్వామ్య చక్రం. కేసీఆర్ నాయకత్వంపై ఇప్పుడు మళ్లీ ప్రశంసలు వినిపించడం కూడా ఈ కోణంలోనే చూడాలి. అధికారంలో ఉన్నప్పుడు కేసీఆర్‌పై తీవ్ర విమర్శలు చేసిన వారే ఇప్పుడు ఆయన నాయకత్వ సామర్థ్యాన్ని గుర్తుచేస్తే, అది కేవలం వ్యక్తిగత అభిప్రాయ మార్పు మాత్రమే కాకుండా రాజకీయ పునర్మూల్యాంకనం కూడా కావచ్చు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఈ పరిణామాలు ఒక హెచ్చరిక. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ ప్రజల్లోని అసంతృప్తిని రాజకీయంగా సమీకరించి అధికారంలోకి వచ్చింది. ఇప్పుడు అదే ప్రజలు ప్రభుత్వాన్ని అంచనా వేస్తున్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల సమస్యలపై నిర్లక్ష్యం చేస్తే, గతంలో తాము ఉపయోగించిన రాజకీయ ఆయుధాలే రేపు తమపై ప్రయోగిస్తారు. ప్రజాస్వామ్యంలో అధికారానికి ప్రత్యామ్నాయం ఎప్పుడూ సిద్ధంగానే ఉంటుంది. అందుకే ఏ ప్రభుత్వమైనా అధికారాన్ని శాశ్వత హక్కుగా భావించకూడదు. నాయకుల స్వరాల్లో మార్పు ఒక్కటే కాదు.. ప్రజల స్వరంలో మార్పే అసలు విషయం. ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్న యువకుడికి ప్రభుత్వం ఏమిచ్చింది? రైతుకు ఆదాయం, పంటకు ధర, సాగునీటికి భరోసా ఎంత? మహిళలకు భద్రత, ఆర్థిక స్వావలంబన ఎంత? నగరాల్లో మౌలిక సదుపాయాలు మెరుగయ్యాయా? గ్రామాల్లో ప్రభుత్వ సేవలు అందుతున్నాయా? సంక్షేమ పథకాలు నిజంగా అర్హులకు చేరుతున్నాయా? ఈ ప్రశ్నలకు సమాధానాలే ఎన్నికల తీర్పును ప్రభావితం చేస్తాయి. రాజకీయాల్లో ఒక విషయం మాత్రం తరచూ నిజమవుతుంది. గాలి మారే ముందు స్వరాలు మారుతాయి. నిన్నటి వరకు ఒక పార్టీని తిట్టినవారు, ఈరోజు అదే పార్టీ నాయకత్వాన్ని పొగడటం.. నిన్నటి వరకు ఓడిపోయిందనుకున్న నాయకుడి ప్రాధాన్యాన్ని మళ్లీ గుర్తించడం.. రాజకీయ సమీకరణాల్లో మార్పులకు సంకేతం కావచ్చు. రాబోయే రోజుల్లో తెలంగాణ రాజకీయాలు మరింత ఆసక్తికరంగా మారే అవకాశముంది. కాంగ్రెస్ తన పాలనతో ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవాల్సి ఉంటుంది. బీఆర్ఎస్ తన రాజకీయ పునరాగమనాన్ని ప్రజా సమస్యలతో అనుసంధానించాల్సి ఉంటుంది. ఇతర పార్టీలు తమ స్థానం కోసం పోరాడాల్సి ఉంటుంది.

- శశిధర్ అక్కెల, జగిత్యాల

This newspaper is Owned and Published by BOMMAKANTI SHRAVAN KUMARfrom H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by BOMMAKANTI SHRAVAN KUMAR and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004